teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్


నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 162 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 4 అక్టోబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## పదేళ్లు పూర్తియిన ప్రధాని 'మన్ కీ బాత్'

**2014లో ఇదే రోజున ఆకాశవాణి కార్యక్రమం ప్రారంభం**




న్యూ ఢిల్లీ, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): ప్రధానమంత్రి నరేంద్రమోడీ రేడియోలోని ప్రముఖ రేడియో కార్యక్రమం మన్ కీ బాత్ గురువారంతో పదేళ్లు పూర్తి చేసుకుంది. 2014లో ఇదే రోజున ఆకాశవాణి కార్యక్రమం ద్వారా మోదీ తన ఆలోచనలను పంచుకోవడం ప్రారంభించారు. కార్యక్రమం యొక్క పదేళ్ల ప్రయాణంలో, దేశంలో సానుకూల ప్రభావాన్ని

మిగతా 2 లో





# జైళ్లలో కుల ఆధారిత వివక్ష రాజ్యాంగ విరుద్ధం

- జైళ్ల మాన్యువల్స్‌లో "క్యాస్ట్" కాలమ్ తొలగింపు
- అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు తీర్పు కాపీ పంపాలి
- ఆదేశాలు జారీ చేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం




న్యూ ఢిల్లీ, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): జైళ్లలో కుల ఆధారిత వివక్ష.. రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు గురువారం సంచలన తీర్పునిచ్చింది. జైలు మాన్యువల్స్‌లో క్యాస్ట్ కాలమ్‌ను తొలగించాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్డీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఖైదీల రిజిస్టర్ల నుంచి

మిగతా 2 లో

## మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై కోర్టును ఆశ్రయించిన హీరో నాగార్జున

**పరువు నష్టం దావా వేసినట్లు సమాచారం**








హైదరాబాద్, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు నాంపల్లి కోర్టులో నాగార్జున పరువు నష్టం దావా వేశారు తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బతీసేలా కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ నాగార్జున న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో నాగార్జున కోరారు. శుక్రవారం నాగార్జున పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపే అవకాశం

మిగతా 2 లో

## ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు సీఎం ఆదేశాలు

**సన్నవడ్లకు ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు**

**సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని సూచనలు**



హైదరాబాద్, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు జారీ చేశారు. సన్నవడ్లకు ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే, సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని వ్యవసాయ అధికారులను సీఎం ఆదేశించారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో

మిగతా 2 లో



## పడిపోతున్న ఆదాయం పరిపాలన వైఫల్యానికి నిదర్శనం


**అనుభవ రాహిత్యంతోనే ఈ అనర్థం అంటూ కేటీఆర్ ట్వీట్**

హైదరాబాద్, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క సంక్షేమ, అభివృద్ధి పథకం అమలుకు నోచుకోలేదు. రేవంత్ సర్కార్ పరిపాలన ఎక్కడ వేసినా గొంగడి అక్కడే

మిగతా 2 లో

## పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు కీలక తీర్పు

**అనర్హతపై నిర్ణయానికి స్పీకర్ కార్యాలయానికి ఆదేశాలు**



హైదరాబాద్, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): ఇటీవల రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఈ మేరకు 4 వారాల్లో అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించింది. అదేవిధంగా అసెంబ్లీకి కార్యదర్శికి సైతం కోర్టు నోటీసులు జారీ చేసింది. ఒకవేళ అనర్హతపై ఎలాంటి నిర్ణయం తీసుకోని పక్షంలో సుమోటో కేసుగా విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాజాగా, సింగిల్ బెంచ్ ఇచ్చిన

మిగతా 2 లో



## సమంత విడాకులపై అనుకోని వాఖ్యలు

**ఎవరిమీద వ్యక్తిగత ద్వేషం లేదన్నారు మంత్రి కొండా సురేఖ**

హైదరాబాద్, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): అక్కినేని కుటుంబం, సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. అనుకోకుండా అక్కినేని కుటుంబంపై

మిగతా 2 లో



## మూసీ బాధితులు మెచ్చుకుంటే ముక్కు నేలకు రాస్తా

**నిన్న.. నేడు కూల్చిన ఏరియాకు పోదాం వస్తావా..**

**రేవంత్ రెడ్డికి సవాల్ విసిరిన ఈటెల రాజేందర్**

హైదరాబాద్, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): మూసీ నది ప్రక్షాళన విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. మూసీ బాధితులను కావాలనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రెచ్చగొడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. మూసీ బాధితులను తాను రెచ్చగొడుతున్నాను

మిగతా 2 లో

## విడుదలైన ఓటర్ల తుది జాబితా

**33 జిల్లాల్లో 1,67,33,584 ఓటర్లు ఉన్నట్లు ఈసీ వెల్లడి**

**రిజర్వేషన్ అంశంపై కొలిక్కిరాని నిర్ణయం**



హైదరాబాద్, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలో 12,867 పంచాయతీల్లో 1,67,33,584 మంది ఓటర్లున్నట్టు తెలిపింది. ఇందులో 82,04,518 పురుషులు, 85,28,573

మిగతా 2 లో



## మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి

**కించపరచాలన్నది మంత్రి కొండా ఉద్దేశ్యం కాదు**

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**

హైదరాబాద్, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): మహిళల మనోభావాలను కించపర చాలన్నది మంత్రి కొండా సురేఖ ఉద్దేశ్యం కాదన్నారు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. కొండా

మిగతా 2 లో

## సబితమ్మ ఫాం హౌసులు కూలగొట్టుడే

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): సబితమ్మ నీది.. నీ కొడుకుల ఫాం హౌసులు కూలగొట్టుడే అంటూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలట్ కార్యక్రమాన్ని ప్రారంభించిన

మిగతా 2 లో



## ఆధార్ కార్డులా రాష్ట్రంలో ఇక ఫ్యామిలీ డిజిటల్‌కార్డులు

**పథకాలకు ప్రామాణిక కానున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు**

**రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్**

కరీంనగర్ జిల్లా, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): ఆధార్‌కార్డు లాగా రాష్ట్రంలో ప్రతి ఫ్యామిలీకి డిజిటల్‌కార్డు విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్‌అన్నారు. గురువారం ఫ్యామిలీ

మిగతా 2 లో

# వైస్ ఛాన్స్‌లర్ల నియామకానికి కసరత్తు ముమ్మరం

## దూకుడు పెంచిన సెర్చ్ కమిటీలు

## రెండు రోజుల పాటు సెర్చ్ కమిటీలు కీలక భేటీలు













హైదరాబాద్, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోని ప్రభుత్వ యూనివర్సిటీల వైస్ ఛాన్స్‌లర్ల నియామకం కోసం కసరత్తు కొనసాగుతోంది. వీసీల నియామాకం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీలు దూకుడు పెంచాయి. ఇందులో భాగంగా గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు సెర్చ్ కమిటీలు కీలక భేటీలు నిర్వహించనున్నాయి.

గురువారం పాలమూరు, తెలుగు యూనివర్సిటీ, ఓయూలో సమామైన సెర్చ్ కమిటీలు. నేడు కాకతీయ, జేఎన్టీయూ, తెలంగాణ, శాతవాహన యూనివర్సిటీలలో సమావేశాలు నిర్వహించి వీసీ పోస్టు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించనున్నాయి. సెర్చ్ కమిటీల నివేదిక అనంతరం ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ వర్శిటీలకు వీసీలను నియమించనుంది.కాగా, రాష్ట్రంలోని 10 ప్రభుత్వ యూనివర్సిటీలకు వీసీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. వీసీల నియామకం కోసం ప్రభుత్వం సెర్చ్ కమిటీలని ఏర్పాటు చేసింది. పది యూనివర్సిటీల వీసీ పోస్టుల కోసం మొత్తం 1382 దరఖాస్తులు చేసుకున్నారు. సెర్చ్ కమిటీలు వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్న వారి అప్లికేషన్లు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నాయి. సెర్చ్ కమిటీల సిఫారసుల మేరకు ప్రభుత్వం వర్శిటీలకు వైస్ ఛాన్సలర్లను నియమించనుంది. ఎలాంటి అవకతవకలు జరగకుండా సామాజిక సమీకరణాలు, క్లీన్ బయోడేటా ఉన్నవారినే పరిగణనలోకి తీసుకొని వీసీలను నియమించాలని రేవంత్ రెడ్డి సర్కార్ భావిస్తోంది. వర్సిటీలను అభివృద్ధి చేసే వారికే వీసీ పదవు ఇవ్వాలని విద్యార్థులు, అధ్యాపకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సెర్చ్ కమిటీల కసరత్తు అనంతరం ప్రభుత్వం త్వరలోనే వర్శిటీలకు వీసీలను నియమించనుంది.

# మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై కోర్టును ఆశ్రయించిన హీరో నాగార్జున

**మొదటి పేజీ తరువాయి**




THE COURT OF THE HON'BLE SPECIAL JUDIC...
AT NAMPALLY, HYDERABAD
C.C. No. OF 2024
BETWEEN:
Shri. Nagarjuna Akkineni,
S/o. Akkineni Nageswara Rao,
aged about 65 years, Occ: Actor/Business,
R/o. Plot No.959-A, Road No.48,
Jubilee Hills, Film Nagar Road,
Shaikpet, Hyderabad - 500033,
Telangana.
AND
Smt. Konda Surekha,
W/o. Konda Muralidhar Rao,
Aged about 59 years, Occ: Minister,
R/o. H. No. 1-2, Vanchanagiri Village,
Geesugonda Mandal, Warangal District, 506 330.
1. DATE OF OFFENCE : 02.10.2024

ఉంది. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు అసంబద్ధం. అబద్ధం అని సినీ నటుడు అక్కినేని నాగార్జున నిన్న ఎక్స్ వేదికగా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. 'రాజకీయాలకు దూరంగా ఉండే సినీప్రముఖుల జీవితాలను, మీ ప్రత్యర్థులను విమర్శించేందుకు వాడుకోకండి సాటి మనుషుల వ్యక్తిగత జీవితాలను గౌరవించండి' అని సూచించారు. సురేఖ వ్యాఖ్యలను బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ఖండించారు. బాధ్యత కలిగిన పదవిలో ఉన్న మహిళగా మంత్రి కొండా సురేఖ వాఖ్యలు తమ కుటుంబం పట్ల, చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధమని, అబద్ధమని తేల్చిచెప్పారు. తక్షణమే ఆమె తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన అసంబద్ధ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి సినీనటుడు అక్కినేని నాగార్జున సతీమణి, నటి అకినేని అమల ఫిర్యాదుచేశారు. తన కుటుంబంపై సురేఖ అసత్య ఆరోపణలు చేశారని మండిపడ్డారు. రాజకీయ వివాదాల్లోకి తమను లాగవద్దని, తన భర్త గురించి నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ఘాటుగా స్పందించారు. 'రాజకీయ నాయకులే నేరస్థుల్లా ప్రవర్తిస్తే ఈ దేశం ఏమైపోతుంది, సురేఖ తన వ్యాఖ్యలను వెనకి తీసుకుని క్షమాపణలు చెప్పేలా రాహుల్‌గాంధీ చొరవ తీసుకోవాలి' అని అమల డిమాండ్ చేశారు.

# సమంత విడాకులపై అనుకోని వాఖ్యలు

**మొదటి పేజీ తరువాయి**

ఈ వ్యాఖ్యలు చేశారన్నారు తెలంగాణ మంత్రి కొండా సురేఖ. కేటీఆర్ తనపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో భావోద్వేగానికి గురై, ఆయనపై విమర్శలు చేసే క్రమంలో అనుకోకుండా అలా వ్యాఖ్యలు చేశారన్నారు. తనకు ఎవరిమీద వ్యక్తిగత ద్వేషం లేదన్నారు. అక్కినేని కుటుంబం చేసిన పోస్టులు చూసి చాలా బాధపడ్డానన్నారు కొండా సురేఖ. అదే సమయంలో కేటీఆర్ విషయంలో మాత్రం తగ్గేది లేదన్నారు. కేటీఆర్ కు లీగల్ నోటీసు పై న్యాయపరంగా ముందుకెళ్తా మన్నారు కొండా సురేఖ తెలిపారు.

# మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి

**మొదటి పేజీ తరువాయి**

వ్యాఖ్యలతో సినీ ప్రముఖుల మనసు నొచ్చుకుందని, దానికి మంత్రి కొండా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారన్నారు. ఈ అంశం ఇక్కడితో ముగింపు పలకండని విజ్ఞప్తి చేశారు. ఇరువైపులా మహిళలు ఉన్నారని%ా% కావున ఈ విషయాన్ని ఇంతటితో వదిలేయాలని కోరారు. సమాజంలో ఒకరి గురించి ఒకరు చెడుగా మాట్లాడవద్దని మా కాంగ్రెస్ నాయకులకు, మంత్రులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు.

# జైళ్లలో కుల ఆధారిత వివక్ష రాజ్యాంగ విరుద్ధం

**మొదటి పేజీ తరువాయి**



క్యాస్ట్ కాలమ్, కులానికి సంబంధించిన ఏవైనా ప్రస్తావనలను తొలగించాలని సీజేఐ ధర్మాసనం స్పష్టం చేసింది. శుభ్రపరచడం వంటి పనులను అట్టడుగు కులాల వారికి, వంట చేయడం వంటి పనులను ఉన్నత కులాలకు అప్పగించడం రాజ్యాంగంలోని 15వ అధికరణాన్ని ఉల్లంఘించడమేనని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఇటువంటి పద్ధతులు జైళ్లలో అన్యాయమైన ఉద్యోగుల విభజనకు దారితీస్తాయని, కులాల ఆధారంగా కార్మికుల కేటాయింపులను అనుమతించలేమని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. రానున్న మూడు నెలల వ్యవధిలో మోడల్ ప్రిజన్ మాన్యువల్ 2016, మోడల్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ యాక్ట్ 2023లో కుల ఆధారిత వివక్షను పరిష్కరించడానికి అవసరమైన మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని జైళ్లలో కులం పేరు ఆధారంగా ఖైదీలకు పని విభజన చేస్తున్నారని దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీజేఐ ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. కులం ఆధారంగా ఖైదీలపై వివక్ష చూపరాదని పేర్కొంది. "మనకు ఒక సంస్థాగత విధానం అవసరం, ఇక్కడ అట్టడుగు వర్గాలకు చెందిన వ్యక్తులు వారి భవిష్యత్తు గురించి, వారి బాధలను, వేదనలను సమిష్టిగా పంచుకోవాలి. అట్టడుగు వర్గాలకు చెందిన పౌరుల పట్ల వివక్ష చూపే లేదా సానుభూతి లేకుండా వ్యవహరించే సంస్థాగత పద్ధతులను మనం తొలగించాలి. అన్ని ప్రదేశాలలో వ్యవస్థాగత వివక్షను గుర్తించాలి. అన్నింటికంటే కులం హద్దులు ఉక్కుతో తయారు చేయబడ్డాయి. కొన్నిసార్లు కనిపించవు, కానీ దాదాపు ఎల్లప్పుడూ విడదీయరానివి అయితే అవి రాజ్యాంగం శక్తితో వాటిని విచ్ఛిన్నం చేయలేనంత బలంగా లేవు అని సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది. ఈ తీర్పు వెలువడిన తేదీ నుంచి మూడు వారాల వ్యవధిలో ఈ తీర్పు కాపీని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు పంపాలని కూడా కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అత్యున్నత న్యాయస్థానం అనేక ఇతర ఆదేశాలు కూడా జారీ చేసింది. వాటిలో ఒకటి జైలు మాన్యువల్స్‌లో అలవాటు పడిన నేరస్తుల సూచనలను రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు ప్రకటించింది. అంతేకాకుండా ఈ పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తిని, వాదనలు వినిపించిన న్యాయవాదిని కూడా సుప్రీంకోర్టు ప్రశంసించింది.

# ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు సీఎం ఆదేశాలు

**మొదటి పేజీ తరువాయి**



కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రాష్ట్ర వ్యాప్తంగా ఏడు వేల ఐకేపీ సెంటర్లు ఏర్పాటు చేయాలి. అవసరమైన చోట కొత్త ఐకేపీ సెంటర్లు కూడా పెట్టాలి. సన్నవడ్ల కొనుగోలుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. సన్నవడ్లకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలి. ఐకేపీ సెంటర్లకి సీరియల్ నెంబర్లు ఇవ్వాలి. సన్నవడ్లపై ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలి. ధాన్యం కోసం గోనె సంచులు అందుబాటులో ఉండాలి. ధాన్యం కొనుగోలులో వ్యవసాయ అధికారులు భాగం కావాలి. కొనుగోలు చేసిన ధ్యానం వెంటనే తరలించేందుకు ఏర్పాట్లు చేయాలి. ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడవకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. కలెక్టర్లు ప్రతీరోజూ రెండు గంటల పాటు ధాన్యం కొనుగోలుపైన సమీక్ష జరపాలి. ధాన్యం కొనుగోళ్లపైన కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలి. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. కలెక్టర్లు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాల్సిందే. ధాన్యంలో తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను మోసం చేసేవారిని సహించవద్దు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి. రాష్ట్రంలో వంద శాతం రైతులు సన్నబియ్యం పండించేలా చొరవ చూపించాలి. వాతావరణ శాఖ నుంచి వచ్చే సూచనల ప్రకారం ఐకేపీ సెంటర్లలో కొనుగోళ్లు ఏర్పాట్లు చేయాలి అంటూ అధికారులను ఆదేశించారు.

# మూసీ బాధితులు మెచ్చుకుంటే ముక్కు నేలకు రాస్తా

**మొదటి పేజీ తరువాయి**

కదా, మీరు చేస్తున్నది మంచి పని అని మూసీ బాధితులు మిమ్మల్ని మెచ్చుకుంటే బహిరంగంగా ముక్కు నేలకు రాసి, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని రేవంత్ రెడ్డికి ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డికి సవాల్ చేస్తున్నా నీకు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే ఎలాంటి భద్రత లేకుండా మన ఇద్దరం కలిసి మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటిద్దాం. నీవు ఇవాళ ఏ ఇండ్లు అయితే కూలగొడుతున్నావో అక్కడికి ఇద్దరం కలిసి పోదాం. మీరే తేదీ చెప్పండి. తప్పకుండా పోదాం. చైతన్యపురి, ఫణిగిరి కాలనీల ప్రజలు కన్నీళ్లు పెడుతున్నారు. రేపోమాపో డెలివరీ అయ్యే ఓ తొమ్మిది నెలల గర్భిణీ స్త్రీని పట్టుకుని నువ్వు ఈ ఇల్లును ఖాళీ చేసి వెళ్లిపోవాలని అధికారులు ఆదేశించారు. ఒక వేళ ఇల్లు ఖాళీ చేయకపోతే ఇప్పుడిస్తున్న డబుల్ బెడ్రూం ఇల్లు కూడా రాదని ఆ గర్భిణిని భయభ్రాంతులకు గురిచేస్తూ పోలీసులు బలవంతంగా నెట్టేశారు. మరి నేను డెలివరీ ఎక్కడ కావాలని కాళ్ల మీద పడితే.. పోలీసులు కనికరించలేదు. చైతన్యపురి, కొత్తపేట, రామంతాపూర్ ఎక్కడికి వస్తావో రా పోదాం. శభాష్ రేవంత్ రెడ్డి అని మూసీ బాధితులు అంటే నేను రాజకీయాల నుంచి తప్పుకుని, బహిరంగంగా క్షమాపణలు చెప్పి ముక్కు నేలకు రాస్తా అని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

# సబితమ్మ ఫాం హౌసులు కూలగొట్టుడే

**మొదటి పేజీ తరువాయి**



సీఎం రేవంత్ అనంతరం మాట్లాడారు. కేటీఆర్ జన్వాడ ఫాంహౌస్ అక్రమ నిర్మాణం కాదా.. దాన్ని కూల్చాలా.. వద్దా.. అంటూ రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. హరీశ్ రావు అజీజ్ నగర్ లో ఉన్న నీ ఫాంహౌస్ అక్రమ నిర్మాణం కాదా.. దాన్ని కూల్చాలా.. వద్దా.. అని ప్రశ్నించారు. సబితమ్మ పేద అరుపులు వద్దు నీకున్న ఫాంహౌస్ ల లెక్కలు కూడా ఉన్నాయని తెలిపారు. మీ ఫాంహౌస్ లు ఎక్కడ కూలిపోతాయోనని భయపడి పేదలను రక్షణ కవచాలుగా పెట్టుకుని నాటకాలు ఆడుతున్నారని పేర్కొన్నారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ చుట్టూ మీరు కట్టుకున్న ఫాంహౌస్ ల నుంచి వచ్చే మురికి నీటి హైదరాబాద్ ప్రజలు తాగాలా అంటూ ఓ రేంజ్ లో రెచ్చిపోయారు సీఎం రేవంత్ రెడ్డి.

# ఆధార్ కార్డులా రాష్ట్రంలో ఇక ఫ్యామిలీ డిజిటల్‌కార్డులు



**మొదటి పేజీ తరువాయి**

డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టులో భాగంగా కరీంనగర్ నియోజకవర్గంలో తహేర్ కొండాపూర్ లో జరిగిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు నమోదు కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే డిజిటల్‌కార్డుతోనే గవర్నమెంట్‌స్కీంలన్నీ వస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్డును ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో మొత్తం 119 నియోజకవర్గాల్లో 288 చోట్ల ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్ట్ ప్రారంభం అయింది. ఎంతమంది ఉన్న ఫ్యామిలీ పరంగా డిజిటల్‌కార్డు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పం తీసుకుంది. ఈ పైలెట్ ప్రాజెక్ట్ లో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురండి. ఇందులో కుటుంబ ఆస్తుల వివరాలు, అడగరు. కుటుంబసభ్యుల సంఖ్య ఒక గ్రూప్ ఫోటో లాంటి వివరాలు మాత్రమే అడుగుతారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. ఈ కార్డు ఉంటే ప్రభుత్వ పథకాలు ఎక్కడైనా తీసుకోవచ్చు. డిజిటల్ గుర్తింపు కార్డు ఫ్యామిలీ పెద్దగా మహిళను చేస్తున్నం. కర్ణాటక, హర్యాణా రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ డిజిటల్ కార్డులను అమలు చేస్తున్నాయి. ఇప్పటికే అక్కడ అధికారులు పరిశీలించి అధ్యయనం చేశారు. ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాలని సీఎం నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం రూ. లక్ష రుణాన్ని నాలుగు విడతలుగా చేశారు. మేము ఒకసారి కంప్లీట్‌చేశాం. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల సమస్యలను తర్వలో పరిష్కరిస్తాం. అర్హత ఉండి ఎక్కడైనా రుణమాఫీ కాకపోతే అధికారులకు వివరాలు ఇవ్వాలి. రూ. 2 లక్షల పైన ఉన్న వారికి దసరా లోపు మాఫీ అవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి ఇప్పటికే ప్రకటించారని' మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అంతకుముందు తహేర్‌కొండాపూర్‌లో పలు ఇంట్లోకి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలను అడిగి తెలుసుకొని, నమోదు చేశారు.

# పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు కీలక తీర్పు

**మొదటి పేజీ తరువాయి**

తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ అసెంబ్లీ సెక్రటరీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. అయితే, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది. ఈ నెల 24న ఎమ్మెల్యేల అనర్హత కేసుకు సంబంధించి వాదనలు వింటామని డివిజన్ బెంచ్ తెలిపింది. కాగా, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని హైకోర్టు లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద గౌడ్, పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. అన్ని పిటిషన్లపై హైకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టి కేసుకు సంబంధించి సుదీర్ఘ వాదనలు కొనసాగాయి. ఎమ్మెల్యేల అనర్హత వేటు విషయంలో సుప్రీం కోర్టు ఆదేశాలను స్పీకర్ పట్టించుకోవడం లేదని పిటిషనర్ తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు నాలుగు వారాల్లో ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది.

# పడిపోతున్న ఆదాయం పరిపాలన వైఫల్యానికి నిదర్శనం

**మొదటి పేజీ తరువాయి**

అన్నచందంగా తయారైంది. పరిపాలన అస్తవ్యస్తంగా మారడంతో పెట్టుబడులు ఆగిపోయాయి. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లేకుండా పోయాయి. ఆదాయం కూడా పూర్తిగా పడిపోయింది. ఇక రాష్ట్ర ఖజానాకు తగ్గుతున్న ఆదాయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం పరిపాలన వైఫల్యానికి నిదర్శనం, అనుభవ రాహిత్యంతోనే ఈ అనర్థం అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. సంపద సృష్టించి పేదలకు పంచే తెలివి.. సీఎం రేవంత్ రెడ్డికి లేకపోవడంతో అసలు సమస్య ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే ఈ దుస్థితి ఉంటే.. వచ్చే నాలుగేళ్లు కష్టకాలమే అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గడ్డు పరిస్థితులను మరింత దిగజార్చే చేష్టలే తప్ప.. దిద్దుబాటు చర్యలు కనుచూపు మేరలో కనిపించడం లేదన్నారు. తెలంగాణ ప్రగతి పథానికి పాతరేసిన పాపం.. మార్పు మార్పు అంటూ మోసం చేసిన కాంగ్రెస్ పార్టీదే అని కేటీఆర్ దుయ్యబట్టారు.

# విడుదలైన ఓటర్ల తుది జాబితా

**మొదటి పేజీ తరువాయి**

మహిళలు, 493 ఇతరులు ఉన్నారని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో పురుషుల కన్నా మహిళలే అత్యధికంగా ఉన్నట్టు ఈసీ గణాంకాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం వార్డులు, పంచాయతీల రిజర్వేషన్ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. రిజర్వేషన్ల ప్రక్రియ కొలిక్కి వస్తేనే ఎన్నికల నిర్వహణకు అడుగులు ముందుకు పడే అవకాశం ఉంది. కులగణన పూర్తి చేసిన తరువాతే రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో కులగణన పూర్తయి, రిజర్వేషన్లు ఖరారయ్యాకే ఎన్నికలు జరగనున్నాయి.

# పదేళ్లు పూర్తైన ప్రధాని 'మన్ కీ బాత్'

**మొదటి పేజీ తరువాయి**

సృష్టించిన ముఖ్యమైన సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ మరియు ప్రవర్తనా అంశాలను ప్రధాన మంత్రి స్పృశించారు. మన్ కీ బాత్ ప్రధాన మంత్రి మరియు పౌరుల మధ్య పరస్పర చర్చకు ఒక ముఖ్యమైన వేదికగా మారింది. గత నెల మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో, పదేళ్ల కార్యక్రమం యొక్క ప్రయాణం రకరకాల హారాలను సృష్టించిందని, ఇందులో ప్రతి ఎపిసోడ్‌లో కొత్త కథలు, కొత్త రికార్డులు మరియు కొత్త వ్యక్తులు జోడించబడతారని శ్రీ మోదీ అన్నారు. సంఘటిత భావంతో సమాజంలో ఏ పని జరిగినా మన్ కీ బాత్ ద్వారానే గుర్తింపు లభిస్తుందన్నారు. మన్ కీ బాత్ శ్రోతలే ఈ షోకి నిజమైన యాంకర్లని ప్రధాన మంత్రి అన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# ఎవరికీ పట్టని వలస కార్మికులు

'ఎక్కడ జీవితం వుందో అక్కడికే మరణించడానికి వెడతారు వాళ్ళు ఇక్కడికి వాళ్ళు, తిరిగి వాళ్ళ మృత శరీరాలను మాత్రమే మోసుకు వస్తారు' గుల్జార్ ఈ ప్రపంచం రెండుగా చీలిపోయి ఉందన్న విషయం, మునుపెన్నటి కన్నా ఎక్కువగా అందరికీ అర్థం అయింది. సుమారు రెండేళ్ళకు పైగా ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కోవిడ్ పాండమిక్ ప్రబలిన సమయంలోనే లక్షలాది మంది వలస కూలీలు, నెత్తిన మూటలతో, ఆకలి దప్పులకు అలమటిస్తూ, వందల మైళ్ళు పగిలి, నెత్తురోడుతున్న పాదాలతో నడిచి వెడుతున్న దృశ్యాలను, ఇల్లు చేరకనే మరణించిన వాళ్ళని, రైలు పట్టాలపై, రోడ్లపై దిక్కులేని శవాలైన వాళ్ళని, రోడ్లపైనే ప్రసవించిన స్త్రీలను, వాళ్ళ వెంటే నడిచి, నడచి అలసిపోయిన చిన్నిచిన్ని పాదాల పసిపిల్లను మనం చూశాం. వలస కూలీలు కాక, మిగిలిన ఆ సగం ప్రపంచ జనాభాలో, ఏ కొద్ది మందో తప్ప, ఎంత నిర్దయగా, క్రూరంగా సాటి మనుషుల పట్ల ప్రవర్తించగలరో కూడా ప్రపంచం చూసింది. జీవితం ఎక్కడుందో అక్కడికే మరణించడానికి వెడుతున్న వాళ్ళు ఎవరు? ఎందుకలా వెడుతున్నారు? వాళ్ళున్న చోట వాళ్ళకి మరణం తప్ప జీవితం లేకుండా ఎందుకు పోయింది? నిజానికి మానవజాతి పరిణామక్రమంలో అనేక వలసలు జరిగాయి. తమ ఉనికిని, జీవితాన్ని నిలబెట్టుకోవడం కోసం, అంతకన్నా మెరుగైన జీవితాలను ఆశించి జరిగిన ఆ వలసలు చారిత్రకంగా అనివార్యమైనవి. కానీ, ఇంతటి మానవ వికాసం తరువాత, ఇన్నెన్ని నాగరికతల తరువాత, ఒక మనిషికి తాను పుట్టిన చోటే ఎందుకు సుఖంగా, గౌరవప్రదంగా జీవించగల అవకాశం లేకుండాపోయింది? సంపదల సృష్టికారకులైన శ్రామికులకు, వాటి మీద హక్కు మాట అటుంచి, కనీసం తినేందుకు తిండి, ఉండెందుకు నీడ కూడా లేని స్థితి, ఆ సంపదల అసమ పంపిణీ, సామాజిక అసమానతలు, సామాజిక న్యాయం కొరవడటం కారణంగానే, ఉన్న చోట జీవిక లేక బతుకుతెరువు కోసం కోట్లాది మంది దాదాపు ప్రపంచ జనాభాలో సగం మంది తాము పుట్టిన గ్రామాలను, నగరాలను, దేశాలను వదలి వలసపోతున్నారు.

వలసలు అని వేటిని అంటాం?

వాళ్లు పుట్టిన, సాధారణంగా నివసించే నివాస ప్రాంతాలను వదిలి ఒకే దేశం లోపల, ఇతర ప్రాంతాలకు వెళ్లడం లేదా అంతర్జాతీయ సరిహద్దుల్ని దాటి వేరు దేశాలలో నివాసాలు నేర్పరచుకోవడం, తమని తాము రీలొకేట్ చేసుకోవడం దీన్ని వలసగా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ మైగ్రేషన్ నిర్వచిస్తున్నది. ఈ వలసలను అంతర్గత వలసలు, ఎక్స్టర్నల్ మైగ్రేషన్ లేదా ఒక దేశం నుండి మరో దేశానికి అంతర్జాతీయంగా వలసపోవడం, స్వచ్ఛంద వలసలు, తాత్కాలిక వలసలు, రివర్స్ మైగ్రేషన్ ఇలా ఉంటాయని అనుకోవచ్చు. ప్రపంచం అంతటా అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసం కారణంగా బలవంతపు వలసలు, నిర్వాసితులు కావడం జరుగుతూ వుంది. వలసపోవడం అంటే తామున్న భౌగోళిక ప్రాంతాన్ని వదలడమే కాకుండా తమ బంధు మిత్రులని, చివరికి తమ జ్ఞాపకాలని, సంస్కృతిని, జీవన విధానాన్ని, చివరకు ఆహారపు అలవాట్లను సైతం వదులుకోవాల్సి వస్తుంది. పేదరికం, ఉన్న చోట ఉద్యోగ అవకాశాలు లేకపోవడం, పంట నష్టాలు, నిరంతరం ఎదుర్కొంటున్న కరువు కాటకాలు మొదలైనవి వలసలకు కారణాలు. ఇదే కాకుండా మంచి ఉద్యోగాలు, అధిక జీతాలు, అవకాశాలు, మెరుగైన జీవన పరిస్థితులు ఇవి కూడా వేరు వేరు ప్రాంతాలకి వలస వెళ్లడానికి కారణం అవుతాయి. రాజకీయ కారణాలు, అంతర్గత కలహాలు కూడా వలసలకు కారణం. ఆయా ప్రాంతాల్లోనూ, ఆయా దేశాల్లోనూ ఉండడం వల్ల, తమ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని భావించినప్పుడు, అక్కడి నుంచి జనం వ్యక్తులుగాను, సమూహంగాను వలస పోవల్సి వస్తుంది. పాపులేషన్ డివిజన్ ఆఫ్ ద యునైటెడ్ నేషన్స్ డిపార్టుమెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ ఎఫైర్స్ (యు.ఎన్.డి.ఇ.ఎస్.ఎ) ప్రకారం 2020 జులై 1 నాటికి ప్రపంచ వ్యాప్తంగా, అంతర్గతంగా జరుగుతున్న వలసల జనాభా 281 మిలియన్లు. ఐఎల్ఒ రిపోర్టు ప్రకారం ఇలా వలస వెళుతున్న జనాభాలో 42% మంది అంటే 164 మిలియన్ల వలస మహిళా కార్మికులున్నారు. 2020 పాపులేషన్ డివిజన్ రూపొందించిన 2020 నివేదిక ప్రకారం వలస వెళుతున్న ప్రతి నలుగురిలో ముగ్గురి వయసు 20 నుండి 64 సంవత్సరాలు మధ్య ఉంది. 41 మిలియన్ల మంది అంతర్జాతీయ వలసల ప్రజల వయసు సుమారు 20 ఏళ్లు. అంతర్జాతీయంగా వలసవెళున్న వారిలో ప్రపంచ వ్యాప్తంగా సగానికి సగం మంది ఆసియా దేశాల నుంచి అంటే భారత దేశం, చైనా ఇంకా సౌత్ ఏషియా దేశాలైన అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వెళ్ళినవారు ఉన్నారు. ఆ తరువాత మెక్సికో దేశం నుంచి వలస వెళుతున్నటువంటి వాళ్ళ సంఖ్య ఎక్కువగా ఉంది. వలసల గురించి భారత ప్రభుత్వం 2020 -21 నివేదికను ప్రకటించింది. వలసలు తాత్కాలికంగా, దీర్ఘకాలం, శాశ్వతంగా జరిగేవిగా ఉంటాయని అది అంటుంది. వలస కార్మికులతో పనిచేస్తున్న ఒక స్వచ్ఛంద సంస్థ 2017న విడుదల చేసిన ఒక నివేదికలో ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది మన దేశంలో అంతర్గత వలస వెళుతున్నట్టుగా పేర్కొంది. వ్యవసాయపు పనులులేని కాలంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి అక్కడ పనిచేసి, తిరిగి తమ గ్రామాలకు వెళ్లే వాళ్ళ సంఖ్యమన దేశంలో ఎక్కువగానే ఉంటుంది. మన దేశంలో వలసలు వెళుతున్నటువంటి వాళ్ళలో పురుషులు, స్త్రీల మధ్య మరీ అంత వ్యత్యాసం ఏమీ లేదు. ప్రపంచ వ్యాప్తంగా పనిలో ఉన్న మహిళల్లో 63.5% వలస వచ్చిన మహిళలే ఉన్నారు శ్రామిక శక్తిలో. ఈ వలస కార్మికుల్లోనూ 74% మంది సేవా రంగంలోనూ, డొమెస్టిక్ వర్కర్స్‌గా ఇళ్ల పని చేయడంలోను, ఆరోగ్య సేవలు అందించడం, ఆర్థిక రంగంలో, వైజ్ఞానిక, విద్య, ప్రభుత్వపర ఉద్యోగాల్లోనూ కూడా ఉన్నారు. అలాగే, పురుష కార్మికుల కన్నా, మహిళలను పనిలోకి తీసుకోవడానికి కారణం వాళ్ళు తక్కువ వేతనాలకే పని చేయడానికి సిద్ధపడటం. అంటే, చవకగా, శ్రమ దోపిడీ చేసేందుకు ఎక్కువ వెసులుబాటుగా వీళ్ళు ఉండటం. కాగా వలస వెళుతున్న మహిళా కార్మికుల్లో ఎక్కువ మంది అన్‌స్కిల్డ్ లేబర్‌గా, గృహ కార్మికులుగా, పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్నారు.

# చనిపోయిన కుటుంబాలకు మేఘన్న భరోసా

## అనారోగ్యంతో ఉన్న వారికి అభయహస్తం

## మాజీ మంత్రికి రిటర్న్ గిఫ్ట్ ఇస్తానన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి



పెబ్బేరు, అక్టోబర్ 03(తీన్మార్ న్యూస్): రాజకీయ నాయకులు ఇచ్చే హామీలకు గ్యారెంటీ లేదనే చెడ్డపేరు చాలా చోట్ల ఉంది. ఓట్లు అడిగేందుకు, పర్యటనలకు వచ్చినప్పుడు హామీలివ్వడం సర్వసాధారణం.ఆ తర్వాత వాటిని పట్టించుకునేవాళ్లు చాలా తక్కువ అసెంబ్లీ ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తానని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, ఏకంగా పెద్ద జీతగాడిగా ఉంటానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట తప్పకుండా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తూ ఆర్థికంగా లేని కుటుంబాలకు మరియు చనిపోయిన కుటుంబాలకు అభయ హస్తం పేరిట వారి కుటుంబానికి 5వేల రూపాయల ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఆయన ఎవరో కాదు వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వివరాల్లోకి వెళితే వనపర్తి నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో ఉన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఎన్నో కబ్జాలు ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి ఎంతోమందిని వేధించిన విషయం నియోజకవర్గ ప్రజలకు అందరికీ తెలిసిన విషయమే మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని చూస్తేనే భయం వేసేలా ఆయన అహంకార ధోరణికి విసిగిపోయి ఎవరికి చెప్పుకోవాలో వారి బాధలను అర్థం కాక లోలోపల కుమిలిపోతున్న నియోజకవర్గ ప్రజలకు నేనున్నానని భరోసానిస్తూ ఏ ఒక్కరికి అన్యాయం జరిగిన వారి ఇంటికి పెద్ద బిడ్డగా ఉండి వారి పెద్ద జీతగాడిలా పనిచేస్తానని తూడి మేఘారెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబడతానని ప్రతి పల్లె తిరుగుతూ కొద్ది సమయంలోనే కాంగ్రెస్ పార్టీలో చేరి ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ తెచ్చుకున్నారు. వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా నేను గెలిస్తే ప్రజలకు తనేమి చేస్తానో తన ఎజెండా ఏమిటో ప్రజలకు వివరించారు. గత కెసిఆర్ ప్రస్తుతం వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేస్తున్న నిరంజన్ రెడ్డి వనపర్తి జిల్లా కేంద్రంలో మరియు పెబ్బేరులో అక్రమంగా సంత భూములను ఆక్రమించుకున్నారనే ఆరోపణలు వచ్చినా,ఫిర్యాదులు చేసినా చూస్తూ ఊరుకున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఎంత వరకు సమంజసమో చెప్పాలని వనపర్తి నియోజకవర్గం ప్రజలకు వివరించారు. అంతేకాక పెబ్బేరు సంతను మాజీ మంత్రి కబ్జా చేస్తే పట్టించుకునే నాధుడు కరువయ్యారని అట్టి కబ్జా చేసిన సంతను పెబ్బేరుకు తీసుకు వస్తానని మాట ఇచ్చారు.ఆయన మళ్లీ గెలిస్తే రాచరిక పాలన వస్తుందని ప్రజలు ఇప్పటికే భయపడి పోతున్నారని నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. వనపర్తి నియోజకవర్గంలో గులాబీ నాయకుల కుట్రలకు ఎదురుండి నిలిచారు. అనుకున్న ప్రకారం వనపర్తి నియోజకవర్గ ప్రజలు గత ప్రభుత్వంలో ఎన్నో అక్రమాలు అక్రమ కేసులు పెట్టిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి వనపర్తి నియోజకవర్గం ప్రజలు అహంకార నాయకుడికి కర్రు కాల్చి వాత పెట్టినట్టుగా ప్రజా తీర్పు ఇచ్చారు. మాజీ మంత్రికి తగిన బుద్ధి చెప్పి కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యే మేఘారెడ్డికి 25 వేలకు పైగా మెజార్టీతో గెలిపించి విజయ దంక మోగించారు.ఎమ్మెల్యే అంటే ప్రజా సేవకుడు కాదు పెద్ద జీతగాడని అసెంబ్లీ ఎన్నికల ప్రచారం లో అన్న మాటలు అక్షరాల నిజం చేసి అందరితో శభాష్ అనిపించుకుంటున్నాడు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి గెలిచాక ప్రజల గుండెల్లో చొచ్చుకుపోయి వారికి ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు ఉద్యోగాలను కల్పిస్తూ, విధి చిన్న చూపు చూసి చనిపోయిన కుటుంబాలకు మేఘన అభయ హస్తం కింద 5వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తూ ప్రతి కుటుంబానికి పెద్దకొడుకుల సేవ చేస్తున్నాడు. ఆడపిల్లల వివాహాలకు పుస్తే మెట్టెలు అందజేస్తూ మేనమామల అండగా నిలిచి ముందుంటున్నాడు. మేఘారెడ్డి అంటే అందరి ఆత్మీయుడుగా పేరుగాంచాడు. ఎవరైనా నిరుపేద కుటుంబంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతూ ఉన్నారంటే ఆయన నుంచి కచ్చితంగా సాయం అందుతుంది. అందుకేనేమో మేఘారెడ్డి చేతికి ఎముక లేదని అందరూ అంటుంటారు.

**మాజీ మంత్రికి రిటర్న్ గిఫ్ట్ ఇస్తా...**

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంను ప్రజాభవన్ గా నామకరణం చేసి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రతి వారం ప్రజాభవన్ లో ప్రజల సమస్యలను పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.గత ప్రభుత్వం నియోజకవర్గంలో ఐదు సంవత్సరాలలో అభివృద్ధి మాటున అవినీతి, భూ కబ్జా పై విచారణ జరిపి దుర్వినియోగమైన ప్రజాధనాన్ని ప్రజలకు పంచుతామన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తన బినామీ వ్యక్తుల పేర్ల పై దాదాపు వందల కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడ్డారని,వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల్లో అవినీతిని విచారణ జలిపి బట్టబయలు చేస్తామని మాజీ మంత్రిపై ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు పెట్టి వారిని ఎన్నో రకాలుగా వేధించిన మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రిటర్న్ గిఫ్ట్ లకు సిద్ధంగా ఉండాలన్నారు

# అన్నిగ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం

**- అధికారులు రోడ్ల పనులను త్వరితగతిగా పూర్తి చేయాలి**


**- సొంత ఇంటి కలను నెరవేరుస్తాం**

**- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)**



ములుగు జిల్లా, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): రానున్న కొద్ది కాలంలోనే జిల్లాలోని అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని, ఆయా శాఖల అధికారులు మంజూరైన రోడ్ల పనులను త్వరత గతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ములుగు మండలంలోని జంగాలపల్లి క్రాస్ నుండి ఎరుకల వాడ వరకు 80 లక్షల రూపాయలతో నిర్మించిన రోడ్డు పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఆర్ అండ్ బి శాఖల ద్వారా దాదాపు 140 కోట్ల రూపాయలతో రోడ్డు పనులను చేపట్టడం జరుగుతుందని, 30 సంవత్సరాల గ్రామీణ ప్రాంతాల ప్రజల కల నెరవేరబోతున్నదని అన్నారు. ఆయా శాఖల అధికారులు చేపట్టిన రోడ్డు పనులను రెండు మూడు నెలల్లో పూర్తి చేసే విధంగా చొరవ చూపాలని, ఇటీవలనే 33 కోట్ల రూపాయలతో జంగాలపల్లి నుండి అంకన్నగూడెం వరకు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశామని అన్నారు. ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధికి ఎక్కడంతో పాటు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క సారలమ్మ, లక్నవరం సరస్సు లాంటి ప్రాంతాలకు జాతీయ రహదారితో అనుసంధానం చేస్తూ రోడ్డు వెడల్పు కార్యక్రమాలను చేపట్టబోతున్నామని స్పష్టం చేశారు. అత్యవసర సమయంలో ప్రతి ఒక్కరికి రోడ్డుతో అవసరం ఉంటుందని దీనిని దృష్టిలో ఉంచుకొని రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ములుగు నియోజకవర్గానికి గతంలో 3 వేల 500 వందల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా నిరుపేదలకు అధిక మొత్తంలో ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ఉద్దేశంతో 5000 ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని, రానున్న రోజులలో ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలో నిరుపేదలకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ పేరుతో నిర్మించే ఇంట్లో నిర్మాణ పనులను పూర్తిచేసి సొంత ఇంటి కలలు నెరవేరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జ్ సంపత్ రావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈ ఈ వీరభద్రం, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిఎంజెయు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మంతూరి ఆంజనేయులు



హైదరాబాద్, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మంతూరి ఆంజనేయులు (హైదరాబాద్) బాధ్యతలు అప్పగిస్తూ తీర్మానించినట్లు డిఎంజెయు రాష్ట్ర కమిటీ నేడు పత్రిక ప్రకటనలో స్పష్టం చేసింది. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తూ డిజిటల్ మీడియా జర్నలిస్టుల హక్కుల సాధన కై అహర్నిశలు సేవలు అందించగలడనే విశ్వాసాన్ని వ్యవస్థాపకులు ఎంపెల్లి ముతేష్, రాష్ట్ర అధ్యక్షులు కే రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి బొడ్డు అశోక్ ప్రకటించారు. ఈపై సమావేశంలో ముఖ్య అతిథిగా డిఎంజెయు జాతీయ నాయకులు చందా శ్రీనివాస్ హాజరై, దిశానిర్దేశం చేశారు.

# నూతన తాసిల్దార్ ను కలిసిన బిఆర్ఎస్ నాయకులు

ఆత్మకూర్, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల నూతన తహసిల్దార్ గా చాంద్ పాషా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండలం మాజీ ఎంపీపీ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బంగారు శ్రీనివాసులు గురువారం రోజు మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించారు. వీరితోపాటు బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల జనరల్ సెక్రటరీ అజ్జపాగా మాసన్న పాండురంగయ్య బిఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకటన్న సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా : చల్లా

పరకాల, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారిని ఆదుకుంటామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గంలోని సంగెం మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు కోడూరు సదయ్య తండ్రి కోడూరు మల్లయ్య కొద్దిరోజుల క్రితం మృతి చెందడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం మల్లయ్య కుటుంబ సభ్యులను చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. అనంతరం వారి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించి మల్లయ్య మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో ఇటీవలే మృతిచెందిన బిట్ల రాజేశ్వర్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# డిజిటల్ ఫ్యామిలీ సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ పట్టణంలోని రజాల్ పెట్, సలార్ తండలలో జరుగుతున్న డిజిటల్ ఫ్యామిలీ సర్వే ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్. మహబూబాబాద్ పట్టణం రజాల్ పెట్, సలార్ తండా, దంతాలపల్లి రామవరం, మరిపెడ పట్టణం,14, వార్డు లలో డిజిటల్ సర్వే జరుగుతుంది, ఇంటింటికి తిరిగి ప్రత్యేక బృందాలు సర్వే నిర్వహించడం జరుగుతుందని, ఒకరికి ఒక డిజిటల్ ఐడి, మొత్తం ఫ్యామిలీ కి డిజిటల్ ఐడి, ద్వారా పూర్తిగా డిజిటలైజేషన్ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం పక్కాగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారులను, ప్రత్యేక బృందాలను కలెక్టర్ ఆదేశించారు. మహబూబాబాద్ పట్టణంలో జరిగిన సర్వే లో స్థానిక తహసిల్దార్ భగవాన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# నిరుద్యోగులు కాల్స్ కి మోసపోవద్దు

## జిల్లా వైద్యాధికారి అల్లం అప్పయ్య



ములుగు, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): ఈ మధ్యకాలంలో కొంతమంది వ్యక్తులు అమాయకులైన నిరుద్యోగ యువతి, యువకులను వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వారికి 9836330846 గల నంబర్ నుండి ఫోన్ చేసి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో స్టాఫ్ నర్సులు, ఎమ్మెల్యే హెచ్ పి, ఉద్యోగాలు ఉన్నాయని నమ్మించి వారి దగ్గర నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు డిఎం అండ్ హెచ్ఓకి సమాచారం అందినందున, పత్రికల ద్వారా ప్రజలందరికీ తెలియపరుచునది ఏమనగా, నిరుద్యోగ యువతీ యువకులకు ఫోన్లు చేస్తూ వారిని మోసాలకు గురి చేస్తున్నారని, అటువంటి ఫోన్స్ కాల్స్ కు, మోసపోవద్దని డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య తెలిపారు. ఒకవేళ ఏదైనా పోస్ట్ ప్రభుత్వం నుండి అనుమతి పొందిన, లేదా ప్రస్తుతం పని చేస్తున్న వారిలో ఏదైనా పోస్ట్ ఖాళీ అయిన, నిబంధనల మేరకు డిస్టిక్ సెలక్షన్ కమిటీ ,డిస్టిక్ కలెక్టర్ అనుమతితో మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి ఆ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. నిరుద్యోగులు ఒకవేళ మోసానికి గురి అయినట్లు తెలిస్తే వాళ్లు ఆఫీసుకు, దరఖాస్తు ఇస్తే అట్టి వారిపై, క్రిమినల్ చర్య తీసుకోబడతాయని తెలిపారు.

# మున్సిపల్ 2వ వార్డులో ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ సర్వే ప్రారంభం

పరకాల, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ సర్వే గురువారం హన్మకొండ జిల్లా పరకాల మున్సిపల్ రెండవ వార్డులో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ చేతుల మీదుగా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్ పాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహ, స్థానిక 2వ వార్డు కౌన్సిలర్ ఒంటేరు చిన్న సారయ్య మున్సిపల్ కౌన్సిలర్స్ నల్లెల్ల జ్యోతి అనిల్ కుమార్, పసుల లావణ్య రమేష్, శనిగారపు రజిని నవీన్, చందుపట్ల సుజాత సాయి తిరుపతి రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్స్ ముఫినా ఫాతిమా హామీద్, షబ్బీర్ అలీ, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి, సోషల్ మీడియా రెండో వార్డ్ ఇంచార్జి బొచ్చు



జెమిని, నాయకులు బొచ్చు సంపత్, మంద శ్యామ్, జూపాక కిషన్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



పెబ్బేరు, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా పెబ్బేరులో భవాని సేన యూత్ సభ్యులు, తోగుట వీర క్షేత్రియ సంఘం సభ్యులు ,శ్రీ వాసవి మాత ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం నుంచి కలశాలతో, బతుకమ్మలతో, భజన కీర్తనలతో అమ్మవారిని పురువీదుదుల గుండా ఊరేగిస్తూ స్థానిక సుభాష్ చౌరస్తా వద్ద నుంచి "భవాని సేన" సభ్యులు ఏర్పాటు చేసిన చిన్న చౌడేశ్వరి దేవి ఆలయంలోకి విగ్రహాన్ని నిలబెట్టారు. తోగుట వీర క్షత్రియులు ఏర్పాటుచేసిన విగ్రహ ఊరేగింపు, కలషాలతో శ్రీ తోగుట చౌడేశ్వరి దేవి ఆలయం వరకు శోభయాత్ర గా ఈ కార్యక్రమం ముగిసింది. అనంతరం శ్రీ వాసవి మాత ఆలయ కమిటీ సభ్యులు బతుకమ్మలతో, కలశాలతో అంగరంగ వైభవంగా శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం నుంచి బతుకమ్మలను ఆడుతూ, శ్రీ వాసవి మాత ఆలయం వరకు శోభయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో పెబ్బేర్ వివిధ ఆలయాల కమిటీ సభ్యులు, హిందూ జాగృతం సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# కుక్కల వృద్ధి నియంత్రణకు కేంద్రాన్ని సిద్ధం చేయాలి

♦ భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): సోమవారం వరకు కుక్కల వృద్ధి నియంత్రణ శస్త్ర చికిత్సా కేంద్రాన్ని సిద్ధం చేయాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి భూపాలపల్లి జిల్లా కేంద్రం హనుమాన్ నగర్ ఏర్పాటు చేయనున్న యానిమల్ బర్త్ కంట్రోల్ యూనిట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ శస్త్ర చికిత్సలు అనంతరం కుక్కలు ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆపరేషన్ తదుపరి కుక్కలను విడిగా ఉంచాల్సిన అవసరం ఉన్నందున ఐరన్ కేజ్ సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. కేంద్రం పరిసరాలు. పరిశుభ్రంగా తయారు



చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెగ్గం వెంకటరాణి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్సి అభ్యర్థుల సర్టిఫికెట్ విచారణ ఈ నెల 5 వరకే

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): డిఎస్సికి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ విచారణ ప్రక్రియకు ఈ నెల 5వ తేదీ వరకు మాత్రమే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో డిఎస్సి కి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్స్ విచారణ ప్రక్రియ, వానాకాలం దాన్యం కొనుగోలుపై ఎస్పి కిరణ్ ఖరే తో కలసి విద్యా, పౌర సరఫరాలు, మార్కెటింగ్, తూనికలు కొలతలు, వ్యవసాయ, సహకార, డిఆర్డీఏ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డి ఎస్సి కి 589 మంది ఎంపికయ్యారని వారిల్ 1:3 నిష్పత్తిలో సర్టిఫికెట్స్ విచారణ జరుగుతుందని ఇప్పటి వరకు 197 మంది అభ్యర్థులకు మాత్రమే వేరిఫికేషన్ జరిగిందని, 5వ తేదీ వరకు అనగా కేవలం రెండు రోజులు మాత్రమే అవకాశం ఉన్నందున వేరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డీఈఓ ను ఆదేశించారు. వేరిఫికేషన్ ప్రక్రియకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంఈఓల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

దాన్యం కొనుగోలు గురించి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దొడ్డు, సన్న రకం కొనుగోలు కు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో గత సంవత్సరం 51 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని ఇప్పుడు ప్రభుత్వం ప్రకటించిన 500 బోనస్ వల్ల 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరణ జరిగే అవకాశం ఉందని కొనుగోలు కేంద్రాలు గతం కంటే ఎక్కువగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.




వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల అధికారులు సమావేశం నిర్వహించి సమగ్ర కార్యాచరణ తయారు చేయాలని సూచించారు. జిల్లాలో సాగైన వరి పంట వివరాల నివేదిక ప్రకారం, ప్రతి కొనుగోలు కేంద్రానికి ప్యాడి క్లీనర్లు, తూకపు యంత్రాలు, మాయిచ్చర్స్, టార్పా లిన్స్ అందుబాటులో ఉంచాలన్నారు.

కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

గోనె సంచులు కొరత లేకుండా చూడాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి 2320 రూపాయలు, బి గ్రాడ్ రకానికి 2300 మద్దతు ధర పకటించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఈఓ రాజేందర్, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, మార్కెటింగ్ అధికారి కనుక శేఖర్, పౌర సరఫరాల సంస్థ డిఎం రాములు, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, డి ఆర్ డి అవినాష్, సహకార అధికారి వాలియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వయోవృద్ధులు సమాజానికి విలువైనవారు

■ భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): వయోవృద్ధులు సమాజానికి ఎంతో విలువైనవారని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం ఐడీఓసీ ఆకార్యాలయంలో మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ శర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ వయోవృద్ధుల అనుభవాలు, విజ్ఞానం యువతకు మార్గనిర్దేశకమని, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, వారికి అవసరమైన సహాయం అందించడంలో ఎలాంటి రాజీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. నేటి సమాజంలో ఉన్నతులుగా ఎదిగిన తరువాత సంతానం తల్లిదండ్రుల ఆలనా, పాలనా విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వయోవృద్ధును గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని వారికి అవసరమైన సహాయం అందించడంలో ఎలాంటి రాజీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సంక్షేమ శాఖ పనిచేస్తుందని ఇబ్బందులకు గురయ్యే వయోవృద్ధులు తనకు కానీ సంక్షేమ అధికారికి కానీ పిర్యాదు చేయాలని లేదా టోల్ ఫ్రీ నంబర్ 14567 కు పిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ




వయోవృద్ధులను గౌరవించడం మన బాధ్యతని అన్నారు. వయోవృద్ధుల అనుభవాలు నేటి తరాలకు స్ఫూర్తి దాయకమని అన్నారు. వయోవృద్ధుల అనుభవాలు నేటి తరాలకు అందించాలని అన్నారు. వయోవృద్ధుల సంక్షేమాన్ని విస్మరిస్తే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇబ్బందులకు గురయ్యే వయోవృద్ధులు ఆర్డిఓ కు కానీ టోల్ ఫ్రీ నంబర్ కు కానీ పిర్యాదు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా వయోవృద్ధులకు శుభాకాంక్షలు తెలిపారు. సంక్షేమ శాఖ ద్వారా అమృత వర్షిణి వయోవృద్ధుల ఆశ్రమానికి టివిని విరాళంగా అందచేశారు. అనంతరం వయోవృద్ధులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సంక్షేమ అధికారి చిన్నయ్య, డిపిఓ నారాయణరావు, అమృత వర్షిణి వయోవృద్ధుల ఆశ్రమ నిర్వాహకులు శ్యాం ప్రసాద్, వయోవృద్ధుల సంఘాలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిహెచ్డి అడ్మిషన్లలో న్యాయం కోసం పురుగుల మందు త్రాగె ప్రయత్నం

♦ సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యయత్నం చేసిన విద్యార్థులు

♦ రిజిస్టార్ మల్లారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు



హన్మకొండ కేయు, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీలో కేటగిరి-2 సెకండ్ లిస్ట్ లో పి.హెచ్.డి అడ్మిషన్స్ లలో రాని తమకు న్యాయం చేయమని అనేక సార్లు ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ వాకాటి కరుణ దగ్గరికి వెళ్లి అభ్యర్థించుకొగా మరియు ప్రభుత్వంలోని పలువురు మంత్రులు కూడా విద్యార్థులకు న్యాయం చేయమని చెప్పినప్పటికి రిజిస్ట్రార్ ప్రొ. మల్లారెడ్డి ఇంచార్జ్ వీ.సీ వాకటి కరుణకు తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుదోవా పట్టిస్తున్నారని విద్యార్థులు వాపోయారు అంతేకాకుండా పీహెచ్డీ అవకతవకలపై పోరాటం చేసింది మేము ప్రభుత్వం అడ్మిషన్స్ ఇచ్చేలా ఒత్తిడి తెచ్చింది మేము తీరా మాకు అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ వాకటి కరుణ విద్యార్థులకు సీట్లు పెంచి న్యాయం చేయాలని రిజిస్ట్రార్ బాధ్యత అప్పగిస్తే రిజిస్ట్రార్ సీట్లు పెంచకుండా అడ్డుపడుతూ విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారని విద్యార్థులలో గందరగోళం సృష్టిస్తున్నారని ప్రశాంతంగా ఉన్న యూనివర్సిటీ లో గొడవలకు దారితీసేలా ప్రవర్తిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని మేము తెలంగాణ మరియు సామజిక ఉద్యమాలు చేసి తీవ్రంగా నష్టపోయామని మాకు సీటు ఇచ్చి న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు. అడ్మిషన్ వచ్చే వరకు పోరాడుతాం, ప్రాణాలైనా అర్పిస్తాం అని రిజిస్ట్రర్ మల్లారెడ్డిని హెచ్చరించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి సోషల్ సైన్స్ డీన్ ప్రొ.మనోహర్ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొ.సురేష్ లాలూ మరియు యూనివర్సిటీ ఈ.సి మెంబెర్ డా.చిర్రా రాజు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో టవర్ దిగారు. ఆందోళన చేసిన వారిలో మందా నరేష్ బోట్ల మనోహర్, బందీగా రాకేశ్,తిరుపతి నాయక్, సొరుపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు

# ఈనెల ఐదులోపు ధృవీకరణ పత్రాలు సమర్పించాలి

– డీఎస్సీ 2023కి ఎంపికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు

– జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్

ములుగు జిల్లా, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): ఉపాధ్యాయ పోస్టులకు అర్హత పొందిన అభ్యర్థులు ఈనెల 5వ తేదీ లోగా వారి ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీ.ఎస్. గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లాలో 192 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి డీఎస్సీ పరీక్షల ద్వారా 576 మంది అర్హత పొందారని వీరిలో 1:3 ప్రకారం పోస్టులను భర్తీ చేయడం జరుగుతుంది. 1:3 నిష్పత్తిలో ఎంపిక కాబడినటువంటి అభ్యర్థులకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల యందు ఐదవ తేదీ వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించబడుతుందను, అర్హత పొందిన వారికి త్వరలోనే



అపార్ట్మెంట్ ఆర్డర్స్ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పూర్తి వివరాల కోసం జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని సంప్రదించాలని ఆ ప్రకటనలో కలెక్టర్ కోరారు.

# గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిని సందర్శించిన ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్

మహబూబాబాద్, సెప్టెంబర్ 03 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె. హైమవతి, ఐఏఎస్ గురువారం మహబూబాబాద్, గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల తీవ్రత, మందుల సరఫరా, వైద్యుల లభ్యత, అందుబాటులోని పడకలు, వైద్య సేవలు, రిపోర్టింగ్ విధానం, ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తున్న తీరు సహా వివిధ అంశాలను పరిశీలించారు. అలాగే ఆసుపత్రులలోని అన్ని విభాగాలను సందర్శించారు. జనవరి నుండి సెప్టెంబర్ వరకు నమోదైన డెంగ్యూ, మలేరియా వివరాలను, ఖాళీగా ఉన్న డాక్టర్ల మరియు సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. పేషెంట్ లకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అంతే కాకుండా %ఎ×ఐ% స్క్రీనింగ్ కోసం ఆయుష్ మాన్ ఆరోగ్య మందిరం లో పనిచేసే యం యల్ హెచ్ పి లు చేయాలనీ ఒక వేళ పాజిటివ్ గా నిర్ధారణ జరిగితే జిల్లా కేంద్రం లోని ఐ సి టి సి సెంటర్ కి పంపించి కౌన్సిలింగ్ ఇప్పించాలని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్శనలో ఆమె వెంట అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రాజ్ కుమార్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ఇన్ ఛార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్ , డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ మురళీ ధర్ ప్రోగ్రాం ఆఫీసర్ సుధీర్ రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్, ఫిజీషియన్ డాక్టరు సుధాకర్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలు నేరాలకు అడ్డుకట్ట వేస్తాయి

– గ్రామాలకు మరింత భద్రత

– అమరచింత ఎస్సై సురేష్

అమరచింత, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండలం మిట్టనందిమల్ల గ్రామంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు అమరచింత సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ ఆధ్వర్యంలో గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల గ్రామాలలో మరింత భద్రత శాంతిభద్రతలు మెరుగుపడే అవకాశం ఉంటుందని గ్రామ ప్రజలకు తెలియజేశారు గ్రామంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గ్రామస్తులతో సీసీ కెమెరాలు వాటి యొక్క ఉపయోగాలు సీసీ కెమెరాలు నేరాలను అడ్డుకట్ట వేస్తాయని చుట్టూ కెమెరాలు ఉన్నాయని తెలుసుకుని దొంగతనాలు ఇతర అసాంఘిక నేరాలు జరగకుండా అరికట్టవచ్చని గ్రామాలలో ప్రధాన మార్గాలలో చివరస్తాలో సీసీ కెమెరాల ద్వారా చాలామంది నేరస్తులను పట్టుకోవడం జరిగిందని వీడియోల ఆధారంగా నేరస్తులను సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. గ్రామాలలో సీసీ కెమెరాలు పోలీస్ స్టేషన్లో జియో ట్యాగ్ చేయడం



వల్ల గ్రామాలలో ఎలాంటి సంఘటనలు జరిగినా వెంటనే త్వరగా చేరుకొని శాంతిభద్రతలు పరిరక్షించవచ్చని ఎస్ఐ సురేష్ అన్నారు. కావున ప్రతి ఒక్కరు గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఒక్కో సిసి కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ఈ సందర్భంగా వారు అన్నారు.

ఇట్టి కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సర్వ రెడ్డి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఈదురుగాలులు.. వర్ష బీభత్సం విరిగిన చెట్లు, స్తంభాలు





పెబ్బేరు, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండలంలో ఓ వైపు ఎండలు మండుతుండగా గురువారం సాయంత్రం నుంచి రాత్రి ఈదురు గాలులు, ఉరుములతో భారీ వర్షం కురిసింది. వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో సాయంత్రం 5గంటల నుంచి వర్షం మొదలైంది. ఉరుములు, మెరుపులతో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు, చెట్లు నెలకొరిగాయి. పెబ్బేరు పట్టణ కేంద్రంలో కర్నూలు వెళ్లే రహదారిపై ఈదురుగాలులకు చెట్లు విరిగిపడ్డాయి. దీంతో కాసేపు వాహనదారుల రాకపోకలు ఆగిపోయాయి. మున్సిపాలిటీ కేంద్రంలో కరెంటు స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వివిధ గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములతో భారీ వర్షం పడటంతో విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# పోషకాహారం మనిషికి అమృతం లాంటిది

**- పోషణ లోపాన్ని అరికట్టడానికి ప్రభుత్వం నిశ్చయంతో ఉంది**

**- రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)**



మంగపేట, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): పోషకాహారం మనిషికి అమృతం లాంటిదని, గర్భిణీ స్త్రీలు, బాలింతలు చిన్నారుల్లో పోషణ లోపాన్ని అరికట్టడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నందున అంగన్వాడీ ద్వారా అందే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క రాష్ట్ర ప్రజలను కోరారు. గురువారం మంగపేట మండల కేంద్రం లోని రైతు వేదిక వద్ద మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ములుగు ఆధ్వర్యం లో "పోషణ్ - మా" సంబరాల జిల్లా స్థాయి ముగింపు వేడుకల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సమాజం ఎంత నాగరికంగా అభివృద్ధి చెందుతున్నదో, అంతగా కలుషితం అవుతున్నదని, ఈ సృష్టిలో కలుషితం కానీ పదార్థం ఏమైనా ఉంటే అవి కేవలం తల్లి పాలు మాత్రమే అని అన్నారు. అంత స్వచ్ఛమైన తల్లి పాలు, ముఖ్యంగా ముర్రుపాలు బిడ్డకు అమృతం వంటివని, అవి బిడ్డకు నిండు నూరేళ్ళ భవిష్యత్తును ఇస్తాయని అన్నారు. ములుగు జిల్లా అత్యధికంగా మారుమూల గ్రామాల గిరిజన గూడేలను కలిగి ఉన్నదని, ఈ ప్రాంతాల్లోని అత్యధిక జనాభాకు ఆరోగ్యపరమైన అక్షరాస్యత చాల ముఖ్యం అని అభిప్రాయ పడ్డారు. తల్లి పాల ప్రాముఖ్యత, చక్కని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం లో పౌష్టికాహారం గొప్పదనం గురించి ఐసీడీఎస్ ద్వారా ఈ నెల రోజులు పోషణ మా సంబరాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. గ్రామ స్థాయిలో అంగన్వాడీలు గృహ సందర్శన చేసి ప్రభుత్వం ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని వారు మాత్రమే వినియోగించుకునేలా వాటి ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు. అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమం ద్వారా తెలంగాణ ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా నాణ్యమైన పౌష్టికాహారంతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను 6 సం.ల లోపు వయస్సున్న చిన్నారులకు అందిస్తుందని అన్నారు. తల్లి తండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు ప్రతీ రోజూ పంపడం వల్ల అక్కడ కృత్యాల రూపంలో బోధించే విద్య ద్వారా పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందని అలాగే పౌష్టికాహారం ద్వారా వారు ఆరోగ్యవంతంగా తరవుతారని తల్లితండ్రు లకు సూచించారు. జిల్లాలో మరియు రాష్ట్రం లో లోప పోషణతో ఉన్నట్లుగా గుర్తించిన శిశువులను తప్పనిసరిగా సాధారణ స్థాయికి వచ్చేలా చొరవ చూపాలని ICDS అధికారులకు సూచించారు. ములుగు జిల్లాలో రక్త హీనత, పోషకాహార లోపం అన్న పదాలు వినపడని రీతిలో గర్భిణీస్త్రీలు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్యం మెరుగు పడాలని, దేశానికే ఆదర్శవంతంగా మన జిల్లాను నిలపాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను క్షేత్ర స్థాయిలో అంకిత భావంతో అందించాలని, నాణ్యమైన సరుకులను మాత్రమే అందించాలని, సరుకుల్లో ఏమైనా నాణ్యత లోపిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో SAM, MAM లుగా గుర్తించిన చిన్నారుల పైన ప్రత్యేకదృష్టి నిలిపి వారిని సాధ్యమైనంత త్వరగా సాధారణ స్థాయికి తీసుకురావాలని సూచించారు. అనంతరం 13 మంది గర్భిణీ స్త్రీలకు మంత్రి చేతులమీదుగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం మంత్రి, కలెక్టర్ మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. అంతకుముందు మండలం కేంద్రంలో 52 లక్షల నిధులతో బస్ స్టేషన్ నిర్మాణము పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఆర్టీసీ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జి సంపత్ రావు, మండల ప్రత్యేక అధికారి తుల రవి, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, ICDS సీడీపీఓ లు ప్రేమలత, మల్లీశ్వరి, ముత్తమ్మ, ఏటూరునాగారం ICDS ప్రాజెక్టు పరిధిలోని సూపర్వైజర్లు, పోషణ్ అభియాన్ సిబ్బంది ఇమ్మాన్యుయెల్, శ్రావణి, వీరేంద్ర, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# రావిపహాడ్ గ్రామంలో డిజిటల్ కార్డ్ సర్వే

**సర్వేను ప్రారంభించిన ఆర్డీఓ శ్రీనివాసులు**



పాలకవీడు, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం రావిపహాడ్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డిజిటల్ కార్డులకు కావలసిన వివరాలను గృహయజమాలు నుండి సేకరించుటకు, డిజిటల్ సర్వే కు సంబంధించి రావిపహాడ్ గ్రామాన్ని ఎంపిక చెసినందున ఆట్టి గ్రామంలో గురువారం రోజున ఆర్డీఓ శ్రీనివాసులు,చే సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యిట్టి సర్వేలొ గృహా యజమానులు తమ కుటుంబ సభ్యుల వివరాలు,ఆధార్ కార్డ్ వివరాలు ,వయస్సు, ఫొన్ నెంబర్లు యిచ్చి ఫోటో దిగాలిఅని వారు సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు యన్ వి సుబ్బారావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బెల్లంకొండ విజయలక్ష్మి నరసింహారావు, మాజీ ఎంపీపీ భూక్య గోపాల్ నాయక్, మాజీ జెడ్పిటిసి మోతిలాల్ లు మాట్లాడుతూ ప్రభుత్వం యిచ్చే డిజిటల్ కార్డ్ ల వల్ల ప్రభుత్వం ఇచ్చే 30 రకాల పథకాల అమలు కు ఉపయోగం అని,ఈ ఒక్కకార్డు, సంక్షేమపథకాల తొ పాటు, అరోగ్య శ్రి, ఫీజూ రియంబర్స్‌మెంట్,రేషన్ కార్డ్, షాదీ ముబారక్, రైతు బందు, రైతు భీమా, వంటి పలు పథకాలకు ఈ కార్డ్ కుటుంబానికి రక్షణ కవచంగా ఉపయోగ పడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం సైదులు,దానయ్య తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ఎస్టీ కార్పొరేషన్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే రేవూరి





సంగెం, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా సంగెం మండల కేంద్రంలోని తీగరాజుపల్లి గ్రామంలో గల రైతు వేదికలో 5 గురు లబ్ధిదారులకు ఎస్టీ కార్పొరేషన్ నుండి విడుదలైన చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఘనంగా సన్మానించి, యూనిఫాంలు, హెల్త్ ఇన్సూరెన్స్ కాపీలను పంపిణీ చేశారు. ఉజ్వల మారి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్ ని ఎంఎల్ఏ రేవూరి ప్రకాశ్ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా రియాజ్ ఆవిష్కరించారు.

# భూసార పరీక్ష నేలకు శ్రీరామ రక్ష





**- 400 భూసార పరీక్ష నమూనాలను సేకరించినట్లు ముంజ మహేష్ ప్రకటన**

కన్నాయిగూడెం, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): అస్పిరేషనల్ బ్లాక్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కింద మండలంలోని అన్ని గ్రామాలలో 400 భూసార పరీక్ష నమూనాలను రైతుల పంట పొలాలలో సేకరించడం జరిగినది అని ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల వ్యవసాయ అధికారి ముంజ మహేష్ తెలిపినారు. ఈ నమూనాలను పరీక్ష కోసం వరంగల్ లోని భూసార పరీక్ష కేంద్రానికి పంపించడం జరుగుతుందని, 30 రోజుల్లో వీటి పరీక్ష ఫలితాల పత్రాలు రైతులకు అందచేస్తాము అని తెలిపినారు. అంతేకాకుండా రైతులు వాటి ఆధారంగా రైతులకు ఎరువుల వాడుకోవాలని తెలిపినారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కల్యాణి, బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ రాందాస్ అస్పిషనల్ బ్లాక్ ఫెల్లో రవి రైతులు పాల్గొన్నారు.

# సతీ సమేతంగా భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని



హన్మకొండ, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం హనుమకొండలోని వేయి స్తంభాల ఆలయంలో రుద్రేశ్వరా స్వామి వారిని శ్రీ భద్రకాళి దేవాలయంలో శ్రీ భద్రఖాళీ అమ్మవారిని దర్శించుకున్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వారి నాయిని నీలిమ రెడ్డి, కుమార్తె శ్రీమతి శ్రీ శ్రీగోదా విష్ణువర్ధన్ రెడ్డి. ఆయా ఆలయాల దుర్గామాత నవరాత్రి ఉత్సవాల పోస్టర్ లను ఆవిష్కరించారు. ఆలయాల్లో జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారభించారు. వేయి స్థంబాల ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత ప్రతిష్ట కార్యక్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేని ప్రత్యేకంగా వేదమాంత్రోచరణాలతో ఆశీర్వదించారు. అనంతరం ఆటోనగర్ లోని శ్రీ దక్షిణామ్నాయ శ్రీశృంగేరి శంకర మఠంలో శ్రీ శారదా శరన్నవ రాత్రోత్సవములో పాల్గొన్నారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్?

**ముఖ్య కార్యాచరణపై ప్రత్యేక సమీక్షా**




ములుగు, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు, డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్?, అపాయింట్?మెంట్? ఆర్డర్ల ప్రక్రియపై సమీక్ష. హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఉన్నతాధికారులు. ములుగు జిల్లా ఐటిడిఎ ఏటూరు నాగారం కార్యాలయము నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

# పార్టీ కార్యక్రమాలకు దూరంగా సంతోష్...

హైదరాబాద్: జోగినిపల్లి సంతోష్.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో ఈయన హవా.. మామూలుగా ఉండేది కాదు. కేసీఆర్‌ను ఎవరైనా కలవాలంటే ముందుగా ఈయన పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉండేది. మినిస్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, పార్టీ నేతలు ఇలా.. ఎవరైనా సరే ఈయన్ను ప్రసన్నం చేసుకోవాల్సి ఉండేది. ఇలా.. ఆనాడు అన్నీ తానై నడిపించిన సంతోష్ ఇప్పుడు ఎక్కడున్నారనే చర్చ షురూ అయ్యింది. కొన్ని రోజులుగా సంతోష్.. ఎర్రవెల్లి ఫామ్‌హౌజ్‌కూ దూరంగానే ఉంటున్నారని పార్టీ వర్గాల సమాచారం. సుమారు రెండు దశాబ్దాల పాటు కేసీఆర్‌కు నీడలా నిలిచిన ఆయన ఇప్పుడు అంటీముట్టనట్టు ఎందుకు ఉన్నారు.. ? పెద్దాయనే దూరం పెట్టారా?.. గతంలో ఉన్న సాన్నిహిత్యం ఎందుకు తగ్గింది ?.. పార్టీ కార్యక్రమాల్లోనూ ఆయన ఎందుకు పాల్గొనడం లేదు ?.. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఎందుకు గళం విప్పడం లేదు ? కవిత అరెస్టు మొదలు తాజాగా హైడ్రాపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తున్నా ఎందుకు స్పందించలేదు ? అటు కేసీఆర్‌కు దూరమై.. ఇటు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా పార్టీకి సంబంధం లేని.. అదీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గ్రీన్ ఛాలెంజ్ యాక్టివిటీస్‌కు పరిమితం కావడం ఏంటీ..? ఈ ప్రశ్నలే ఇప్పుడు పాలిటిక్స్‌లో చక్కర్లు కొడుతున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో అనేక పరిణామాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీలను గులాబీ నేతలు విమర్శిస్తున్నా సంతోష్ మాత్రం సేఫ్ డిస్టెన్స్ మెయింటెయిన్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు గ్యారంటీలు, రుణమాఫీ, రైతుబంధు, రైతుభరోసా, మహాలక్ష్మి స్కీమ్ అమలు, ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులు, బాలింతలు, శిశువులు మృతి చెందుతున్నా, కనీసం మందులు సైతం దొరకడం లేదని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. తాజాగా హైడ్రా ఇష్యూ జోరుగా సాగుతున్నది. అయినా సంతోష్ మాత్రం 'నాకు సంబంధం లేదు' అన్న తీరులో వ్యవహరించడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే బీజేపీ.. సీబీఐ, ఈడీ ద్వారా కవితను అరెస్టు చేయించిందంటూ కేటీఆర్, హరీశ్‌రావు సహా గులాబీ నేతలంతా విమర్శలు చేశారు. అయినా సంతోష్ ఏనాడూ ట్వీట్‌లు, స్టేట్‌మెంట్లు ఇవ్వలేదు. తిహార్ జైలులో ఉన్న కవితను చూసేందుకు ఫస్ట్ టైం వెళ్లడం మినహా మళ్లీ బెయిల్‌పై రిలీజ్ అయ్యే రోజునే ప్రత్యక్షమయ్యారని గులాబీ లీడర్లు చెబుతున్నారు. అయితే అరెస్టు పరిణామం కవిత, కేటీఆర్‌ను దగ్గర చేయగా.. సంతోష్‌తో మాత్రం ఈ ఇద్దరికీ గ్యాప్ గతంకంటే పెరిగిందనే మాట వినిపిస్తున్నది. మరో వైపు కవిత, కేటీఆర్, హరీశ్‌రావు మధ్య రిలేషన్స్ దెబ్బతీసేందుకు సంతోష్ నడిపిన వ్యవహారమే కారణమనే అభిప్రాయాలూ అప్పట్లో వినిపించాయి. ఢిల్లీ లిక్కర్ కేసులో అరెస్టయ్యేంత వరకూ అటు పార్టీతో, ఇటు కుటుంబ సభ్యులతో కవితకు దూరం పెరిగిందని, అసెంబ్లీ ఎన్నికల్లో బాధ్యతలు అప్పజెప్పడానికి కూడా నాయకత్వం సంసిద్ధంగా లేదనే గుసగుసలూ వచ్చాయి. కానీ అరెస్టు తర్వాత కేటీఆర్, కవిత, హరీశ్‌రావు మధ్య పూర్వపు సంబంధాలు నెలకొనడంతో పాటు కేసీఆర్‌తో సంతోష్‌కు గ్యాప్ పెరిగిందనే మాటలూ ఇప్పుడు వినిపిస్తున్నాయి. సంతోష్ ఇప్పుడు.. పిలిస్తే తప్ప ఫామ్ హౌజ్‌కు వెళ్లడంలేదని, గతంలో అన్నీ తానై నడిపించిన పరిస్థితులు ఇప్పుడు లేవన్నది పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. పదేండ్ల పాటు కేసీఆర్‌ను సొంత పార్టీ నేతలు సైతం కలవనీయకుండా సంతోష్ అడ్డం పడిన వ్యవహారం ఓటమి తర్వాత బహిర్గతమైందని, అందుకే ఆయన్ను దూరం పెట్టాలని కేసీఆర్ డెసిషన్ తీసుకున్నారనేది పార్టీ శ్రేణుల వాదన. సంతోష్ పాత్రను పరిమితం చేసిన తర్వాతనే వివిధ స్థాయిల్లోని లీడర్లు సహా కింది స్థాయి శ్రేణులు కేసీఆర్‌ను కలుసుకునే వెసులుబాటు లభించిందనే అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమైందని తెలుస్తున్నది. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన్ను కలిసేందుకు సంతోష్ అనుమతి కావాలా? అంటూ కవిత సైతం ఒకింత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రగతి భవన్‌కు ఆమె దూరం కావడానికి సంతోషే కారణమనే ఆరోపణలూ వచ్చాయి. కేసీఆర్ తర్వాత ఒక ప్రాక్సీ పవర్ సెంటర్‌గా చక్రం తిప్పిన జోగినపల్లి సంతోష్ ఇప్పుడు పార్టీ వ్యవహారాలకు దూరంగా, పార్టీతో సంబంధం లేని గ్రీన్ ఛాలెంజ్ కార్యకలాపాలకు మాత్రమే పరిమితం కావడం చర్చకు దారి తీస్తున్నది. బీజేపీ పాలిత రాష్ట్రాలైన అసోం, ఒడిశా రాష్ట్రాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలపైనే ఆయన ఫోకస్ పెట్టారు. బీజేపీతో రాజకీయ శతృత్వం లేకుండా పకడ్బందీ ప్లాన్ ప్రకారమే ఎవరికీ అర్థంకాని రీతిలో స్నేహ సంబంధాలు మెయింటెయిన్ చేస్తున్నారా?.. రెండేండ్ల క్రితం ఎంపీగా ఉన్న సమయంలో అన్ని పార్టీలకు చెందిన పార్లమెంటు సభ్యులకు ఇన్విటేషన్ పంపి ఢిల్లీలో మొక్కలు నాటే కార్యక్రమంలో కాంగ్రెస్, వైఎస్ఆర్‌సీపీ నేతలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ రెండు పార్టీలనూ బీఆర్ఎస్ రాజకీయ ప్రత్యర్థులుగా బహిరంగంగా పేర్కొంటున్నా సంతోష్ మాత్రం గ్రీన్ ఛాలెంజ్ పేరుతో వారితో సఖ్యతగా మెలగడంపై అప్పట్లోనే విమర్శలు వచ్చాయి.

# దుర్గ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్పర్సన్



ఆత్మకూర్, అక్టోబర్ 03 (తీన్మార్ న్యూస్): శ్రీశ్రీశ్రీ దేవి శరన్న నవరాత్రుల సందర్భంగా వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో కొలువైన దుర్గామాత అమ్మవారికి ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి రవి కుమార్ యాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఆయుష్‌లో ఖాళీలు ఫార్మసిస్టులు లేక వెల వెల

**- కాంట్రాక్టు ఉద్యోగులకు అన్యాయం**

**- డిప్లొమా కోర్సు ప్రవేశపెట్టాలని సిబ్బంది విజ్ఞప్తి**




హైదరాబాద్: వైద్యారోగ్యశాఖలోని ఆయుష్ విభాగంలో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. ఈ విభాగంలో 580 ఫార్మసిస్టు పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 250 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. 2022 నాటికే 308 ఆయుష్ ఫార్మసిస్ట్ (పాత పేరు కంపౌండర్) ఖాళీలు భర్తీ చేయాల్సి ఉన్నది. గత మూడు సంవత్సరాల్లో 60 నుంచి 70 మంది వరకు పదవీ విరమణ చేశారు. చివరిసారిగా ఈ విభాగంలో 1998లో రెగ్యులర్ ఫార్మసిస్టుల నియామకాన్ని చేపట్టారు. గత 27 సంవత్సరాలుగా రెగ్యులర్ ఉద్యోగాల భర్తీ ఊసే లేకుండా పోయింది. 2008లో దశలవారీగా నేషనల్ హెల్త్ మిషన్ కింద ఫిక్స్‌డ్ రెమ్యునరేషన్ ప్రాతిపదికన 268 మంది నియమితులయ్యారు. కంపౌండర్‌గా పేరున్న ఈ పోస్టులో ఇంటర్‌లో ఏదేనీ సైన్స్ గ్రూపు చేసిన అర్హత కలిగిన వారిని రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ జిల్లా ఎంపిక కమిటీ ద్వారా నియమించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో పాత జీవోను సవరించి కొత్త జీవోను ఇస్తూ అందులో ఆ పోస్టులో కొనసాగేందుకు డిప్లొమో ఇన్ ఫార్మసీ (ఆయుర్వేద, హౌమియో, యునానీ)ని అర్హతగా నిర్ణయించింది. దీంతో అప్పటికే ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న వారి ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించిన అర్హత తెచ్చుకునేందుకు రాష్ట్రంలో అలాంటి కోర్సే లేకపోవడంతో అభ్యర్థులు ఆ కోర్సును ప్రవేశపెట్టాలని కోరారు. అయితే గత ప్రభుత్వం ఆ కోర్సును ప్రవేశపెట్టలేదు. ఆ తర్వాత 2024 వరకు కూడా అలాంటి కోర్సు రాష్ట్రంలో లేకపోవడంతో ఈ పోస్టులకు అభ్యర్థులు కరువయ్యారు. దీంతో ప్రభుత్వమే ఇన్ సర్వీస్ కోర్సుగా ప్రవేశపెట్టి ఇప్పటికే కాంట్రాక్టు ప్రాతిపదికన చేస్తున్న వారికి శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించారు. వారి విజ్ఞప్తిని గత ప్రభుత్వం బేఖాతరు చేయగా, ప్రస్తుత వైద్యారోగ్యశాఖ మంత్రి పరిగణనలోకి తీసుకుని ఆ దిశగా సమీక్ష నిర్వహించి ఇతర రాష్ట్రాల్లో కోర్సుపై అధ్యయనం చేసేందుకు ఒక కమిటీని నియమించారు. ఆ కమిటీ అధ్యయనం చేసి సిలబస్ తదితర వాటిపై నివేదిక సమర్పించింది. దీంతో కాంట్రాక్టు కంపౌండర్ ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి. తమ ఉద్యోగాలు తమకే ఉంటాయని భరోసా కలిగింది. అయితే సెప్టెంబర్ మాసంలో ఆయుష్ కమిషనర్ ఫార్మసిస్టు పోస్టులను డిప్లొమో ఇన్ ఫార్మసీ అర్హత కలిగిన వారితో నింపాలన్న ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించినట్టు సమాచారం. ఒక వైపు ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోగా, అభ్యర్థులు కోరుతున్నట్టు కోర్సు ప్రవేశపెట్టక, శాఖాపరమైన శిక్షణకు ఏర్పాట్లు లేక, అర్హత నుంచి వన్ టైం మినహాయింపు జీవో జారీ చేయకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. మంత్రిని తప్పుదోవ పట్టించేలా కొంత మంది డిప్లొమో ఇన్ ఫార్మసీ అర్హతను ముందుకు తీసుకు వచ్చారనే అనుమానం వ్యక్తమవుతున్నది. ఇప్పటికే డిప్లొమో ఇన్ ఫార్మసీ చదివిన వారికి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 763 పోస్టులకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఆయుష్ ఫార్మసీ పోస్టులను కూడా వారికే ఇస్తే తమ పరిస్థితి ఏంటని ఆయుష్‌లో అనుభవజ్ఞులైన కాంట్రాక్ట్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. దేశంలో దాదాపు సగం రాష్ట్రాల్లో డిప్లొమో ఇన్ ఫార్మసీ (ఆయుర్వేద, హౌమియోపతి, యునానీ) కోర్సు ఉందనీ, రాష్ట్రంలో ఆ కోర్సును ప్రవేశపెట్టాలని సూచిస్తున్నారు. తద్వారా సంబంధిత వైద్యం తెలిసిన వారే ఫార్మసిస్టులుగా ఉద్యోగాలు పొందుతారనీ, పేద రోగులకు కూడా సరైన అర్హత కలిగిన వారి ద్వారా ఆయుష్ ఔషధాల పంపిణీ జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఆయుష్‌కు సంబంధించి 5 మెడికల్ కాలేజీలు, 11 ఆస్పత్రులు, ఆయుర్వేద, యునానీ, హౌమియోపతి స్టోర్స్, 440 ఆయుష్ రెగ్యులర్ డిస్పెన్సరీలున్నాయి. ఇప్పటికే 421 డిస్పెన్సరీలను ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లుగా మార్చారు. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా డిస్పెన్సరీల్లో ఔషధ మొక్కల పెంపకం, ల్యాబ్ టెస్టులు, మెడికల్, వృద్ధాప్య శిబిరాలతో ప్రజలకు సేవలందుతున్నాయి. ఇలాంటి విభాగంలో ఖాళీలు దీర్ఘకాలంగా ఉంచడం, తీరా ఖాళీల భర్తీ సమయంలో ఆయుష్ కాకుండా ఇతర అర్హతలు కలిగిన వారిని ఈ విభాగంలో తీసుకురావడం సరికాదని ఆయుష్ నిపుణులు సూచిస్తున్నారు. ఖాళీలను భర్తీ చేయాలనీ, జీవో నెంబర్ 147ను సవరించి రెగ్యులర్ ఫార్మసిస్ట్ లేదా కంపౌండర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలనీ, రెండేండ్ల ఆయుష్ డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టాలనీ, 2023-24 జాబ్ క్యాలెండర్‌లోని ఆయుష్ ఫార్మసిస్ట్ పోస్టులకు ఎన్ఆర్ హెచ్ఎం కాంట్రాక్టు ఆయుష్ ఫార్మసిస్టులను అర్హులుగా ప్రకటించాలని కోరుతున్నారు.

# రివర్, లేక్ వ్యూ పోయో...రోడ్ వ్యూ వచ్చే...

హైదరాబాద్: ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చుకోవాలని ఉంటుంది. ఆ కల నెరవేర్చుకొనేందుకు పైసా పైసా కూడబెట్టుకుంటారు అందరూ. అలాగే బ్యాంక్ లోన్స్, ఇతర ప్రైవేట్ లోన్స్ తీసుకొని ఇళ్లు నిర్మించుకోవడం, కొనుగోలు చేయడం అనేది ప్రస్తుతం ప్రతీ కుటుంబంలో జరుగుతోంది. అంత కష్టపడి కట్టుకున్న ఇల్లు, లేక కొనుగోలు చేసిన స్థలం చివరకు మన చేతి నుండి జారిపోయే పరిస్థితి వస్తే ఆ భాద వర్ణించలేము. అందుకే ఇంటిని, స్థలాన్ని కొనుగోలు చేసే సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే.. లేకుంటే ఇబ్బందులు తప్పవు. అందులో తెలంగాణలోని హైదరాబాద్ లో అయితే మరీ నిశితంగా పరిశీలించి వీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. హైదరాబాద్ లో ఇటీవల హైడ్రా బఫర్ జోన్, ఎఫ్టీఎల్ పరిధిలో గల అక్రమ నిర్మాణాలను కూల్చేస్తోంది. దీనితో మధ్యవర్తుల మాటలు నమ్మి ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలలో గృహాలు నిర్మించుకొని మోసపోయిన వారు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ధనవంతులకైతే ఏం ఫర్వాలేదు.. కానీ తమ కష్టార్జితంలో ఇళ్లు కట్టుకున్నవారి పరిస్థితి అయితే దారుణమే. తాము ఎన్నో కలలతో నిర్మించుకున్న ఇల్లు హైడ్రా పరిధిలోకి వస్తే ఎలా అనే సందేహాలు అధికంగా నగరవాసుల్లో ఎక్కువగా వినిపిస్తున్నాయి. అందుకే హైదరాబాద్ లో ఇల్లు, స్థలం కొనుగోలు చేస్తున్నామని మురిసి పోవడం కంటే ముందుగా ఈ విషయాలు తెలుసుకుంటే మీ డబ్బు సేఫ్.రివర్ వ్యూ సూపర్ ఉంది కదూ. లేక్ వ్యూ చూసినా చాలుగా అనుకొని ఇంటిని కానీ, స్థలాన్ని కానీ కొనుగోలు చేశారో.. మీది ఇక రోడ్ వ్యూ కాక తప్పదు. అందుకే హైదరాబాద్ లో ఇల్లు, స్థలం, ఫ్లాట్ కొనుగోలు చేసేవారు.. ముందుగా అవి అక్రమ నిర్మాణాలా, కాదా అనేది తెలుసుకోవాలి. ఇందుకోసం మీ దగ్గరలోని లీగల్ అడ్వైజర్లను, రెవెన్యూ అధికారులను సంప్రదించాలి. అప్పుడు ఆ స్థలం పూర్తి చరిత్ర మీరు తెలుసుకొనే అవకాశం ఉంటుంది. అలాగే మీరు కొనే గృహం ఎవరి పేరుపై ఉందో తెలుసుకోవాలి. ఎందుకంటే ఆ గృహం వేరే వారిపై ఉండి, మనం మనకు విక్రయించే వారికి డబ్బులు ఇచ్చామో మన డబ్బు హాంఫట్ స్వాహానే. అందుకే అసలు స్థలం, ఇల్లు ఎవరి పేరుపై ఉందన్న పూర్తి వివరాలు తెలుసుకొని ఉండాలి.. అది కూడా పూర్తిగా ధృవీకరించుకున్నాకే మనం కొనుగోలు చేసేందుకు ముందడుగు వేయాలి. స్థలం లింకు డాక్యుమెంట్స్, ఇంటి పట్టాలు అన్నీ ఒకసారి చెక్ చేసుకొని, సంబంధిత అధికారి వద్దకు వెళ్లి పూర్తిగా నిర్ధారించుకోవాలి. పంచాయతీల పరిధిలోకి వచ్చే ప్రభుత్వ స్థలమా.. లేక గ్రామ కంఠమా అనేది తెలుసుకోవాల్సిందే.. లేకుంటే ఏనాటికైనా ముప్పే. ఆస్తుల విషయంలో అన్ని జాగ్రత్తలు మనం తీసుకున్నప్పటికీ మనం అక్కడక్కడా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటాం. అప్పుడు న్యాయ సలహా తీసుకొని ముందుకు సాగడం మంచిది. అలాగే హైడ్రా తాజాగా ప్రజలు ఎవరూ మోసపోకుండా ఇటీవల తన అధికారిక వెబ్ సైట్ ద్వారా ఒక జాబితాను పొందుపరిచింది. ఆ జాబితాను మనం పరిశీలించినా.. మనం కొనే స్థలం, ఇల్లు హైడ్రా పరిధిలోకి వస్తుందా.. లేదా అన్నది మనకు తెలుస్తుంది. అలాగే మనకు నమ్మకస్తులు అయినప్పటికీ.. స్థలాల కొనుగోలు విషయంలో అన్నీ పత్రాలు సబబుగా ఉన్నాయా లేవా అనేది పరిశీలించుకోవాల్సిందే. చెరువుల పరిధిలోకి వచ్చే గృహాలను మనం కొనుగోలు చేస్తే చివరికి.. మనం ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇవన్నీ ఆలోచించి, నిర్ధారించుకున్నాక మీ సొంతింటి కల నెరవేర్చుకొనేందుకు ముందడుగు వేస్తే మంచిదని న్యాయ నిపుణులు తెలుపుతున్నారు. పైపై అందాలు చూసి మురిసిపోయి, డబ్బులు ఇచ్చారో.. మీ దారి రహదారే కానీ మీ ఇంటి దారి మాత్రం కాదు.

# ఆరుగురి ఎంపిక... రేవంత్ బిగ్ టాస్క్...

హైదరాబాద్: కేబినెట్ విస్తరణ ఇప్పుడు అప్పుడు అంటూ లీకులు ఇవ్వడమే తప్పితే.. ఇంతవరకు విస్తరించింది అయితే లేదు. అటు పార్లమెంట్ ఎన్నికలు ముగిసి కూడా వంద రోజులు ఎప్పుడో గడిచాయి. ఇటు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి పది నెలలు అవుతోంది. కానీ.. ఇంతవరకు విస్తరణకు మాత్రం నోచుకోవడం లేదు. ఆలస్యం అవుతున్న కొద్దీ రోజురోజుకూ ఆశావహుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఈ క్రమంలో అధిష్టానానికి పెద్ద టాస్కులా మారింది.కేబినెట్ విస్తరణపై.. ఇటు ముఖ్యమంత్రి, అటు అధిష్టానం మధ్యం సయోధ్య కుదరడం లేదనే ప్రచారం కూడా ఉంది. అటు రేవంత్ రెడ్డి సిఫారసులు చేస్తుండడం.. పలువురు సీనియర్లు కూడా వారికి తోచిన వారి పేర్లు ఇస్తుండడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇక రేవంత్ ఢిల్లీ పర్యటనకు వెళ్లినప్పుడు క్లారిటీ వస్తుందని అనుకుంటున్నప్పటికీ ప్రతిసారీ వాయిదా పడుతూనే ఉంది. ఇప్పటివరకు రేవంత్ రెడ్డి ఢిల్లీకి 23 సార్లు వెళ్లారు. అందులో మెజార్టీ ప్రయాణాలు కేబినెట్ విస్తరణపై చర్చించేందుకు వెళ్లారని ప్రచారం. నిన్న సాయంత్రం కూడా రేవంత్ మరోసారి ఢిల్లీకి వెళ్లారు. దాంతో మరోసారి కేబినెట్ విస్తరణ అంశం మరోసారి తెరమీదకు వచ్చింది.రేవంత్ అధికారం చేపట్టాక 12 మందితో కేబినెట్ కొలువుదీరింది. మరో ఆరుగురికి ఛాన్స్ ఉండడంతో.. ఆ ఆరుగురి ఎంపిక పెద్ద తలనొప్పిగా మారింది. ఇప్పుడున్న కేబినెట్‌లోనూ చాలా వరకు నేతలు రేవంత్ కు తోడుగా నిలబడడం లేదనే టాక్ నడుస్తోంది. దాంతో ఆ ఆరుగురి ఎంపిక ఆయన కనుసన్నల్లోనే జరగాలనే భావనతో రేవంత్ ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే.. సీఎంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్న సందర్భంలో ఒకరిద్దరు మినహా మిగితా వారి నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదు. బీఆర్ఎస్, బీజేపీలు నేరుగా రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తున్నప్పటికీ వాటిని వ్యతిరేకించే వారు కరువయ్యారు.అందుకే.. మంత్రివర్గం నుంచి రేవంత్ కు పెద్దగా మద్దతు లభించడం లేదనే టాక్ వినిపిస్తోంది. అయితే.. రేవంత్ సిఫారసులకు పలువురు సీనియర్లు అడ్డు పడుతున్నారని తెలుస్తోంది. జమ్ము ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం కూడా తెలంగాణ కేబినెట్‌పై పెద్దగా దృష్టి సారించడం లేదు. మరో నాలుగు రోజుల్లో ఎన్నికలు పూర్తికానున్నాయి.

దాంతో ఇప్పుడు కేబినెట్ విస్తరణ అంశం తెరమీదకు వచ్చింది. ఇక నాన్చివేత ధోరణి అవలంబించకుండా.. ఏదో ఒకటి చేసి ఆ ఆరుగురిని ఎంపిక చేసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అయితే.. అధిష్టానం నిర్ణయంలో సీఎం రేవంత్ సిఫారసులకు పెద్ద పీట వేస్తారా..? సీనియర్లకే ప్రాధాన్యత ఇస్తారా..? అనేది ఆసక్తికరంగా మారింది. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ ఇచ్చిన పేర్లను ఫైనల్ చేసే అవకాశం ఉందని తెలుస్తున్నా.. రేవంత్‌కు ప్రిఫరెన్స్ ఇస్తే సీనియర్ల నుంచి ఎలాంటి వ్యతిరేకత వస్తుందా అని అధిష్టానం పెద్దలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రాష్ట్రం ఆరుగురిని ఎంపిక చేసే అంశం మాత్రం కాంగ్రెస్ అధిష్టానానికి బిగ్ టాస్క్ అయింది.

# పల్లె క్రీడాకారులను ప్రపంచ ఛాంపియన్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**ఒక యజ్ఞం లా సీఎం కప్ 2024..**

**స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి**

హైదరాబాద్;గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తు .. పల్లెల నుండి క్రీడా ప్రతిభ ను గుర్తించి స్థాయి చాంపియన్ లు గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ 20 24 నిర్వహించాలని సన్నాహాలు చేస్తోందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే. శివసేనా రెడ్డి అన్నారు. ఈరోజు ఎల్బీ స్టేడియం లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దశాబ్ది కాలం నుండి క్రీడాకారులకు యువతకు ఎటువంటి ప్రోత్సాహం లేక నిర్వీర్యమై నీరుగారి పోయిన సందర్భంలో... అన్ని రంగాల మాదిరిగానే క్రీడారంగంలో సమూల మార్పు కోసం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తుందని శివసేనా రెడ్డి అన్నారు. పల్లె పల్లెలో క్రీడా సంస్కృతి వెల్లివిరియాలని, పల్లెల్లో ఉన్న ప్రతిభావంతమైన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రపంచ ఛాంపియన్లుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అంచలంచలుగా మారుమూల గ్రామాల నుండి క్రీడా ప్రతిభను వెలికి తీసే ఉద్దేశంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోందని అందులో భాగంగానే ఈ సీఎం కప్ 20 24 నిర్వహణకు శ్రీకారం చుట్టిందని అయిన వివరించారు . గ్రామీణ స్థాయి మండల స్థాయి జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి వివిధ క్రీడాంశాల్లో ఈ పోటీలు నిర్వహించబోతున్నామని అయన అన్నారు. ఏదో మొక్కుబడిగా సీఎం కప్ నిర్వహించకుండా, గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందజేస్తామని అయన తెలిపారు.

టార్చ్ రిలే...

క్రీడాకారులకు స్ఫూర్తిని కలిగించాలని టార్చ్ రిలే ను 33 జిల్లాల్లో క్రీడాజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రేపు మధ్యాహ్నం నాలుగు గంటలకు ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ఈ టార్చ్ రిలే ను ప్రారంభిస్తున్నామని అయన ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం కప్ 2024 కు సంబంధించిన లోగో మస్కట్ ను గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రారంభిస్తారని అదేవిధంగా 2023 గోవాలో జరిగిన జాతీయ క్రీడల్లో విజేతలైన తెలంగాణ క్రీడాకారులకు నగదు పురస్కారాలు అందజేస్తారని ఆయన తెలిపారు.ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా టార్చ్ రిలే ప్రారంభమైన తర్వాత హైదరాబాద్ నగరం పలు ప్రాంతాల నుండి రేపు సాయంత్రానికి వికారాబాద్ జిల్లాకు చేరుకుంటుందన్నారు.ఆ తదుపరి దాదాపు 16 రోజులపాటు 33 జిల్లాలను కవర్ చేస్తూ హైదరాబాద్ కు చేరుకుంటుందనిఅయన వివరించారు టార్చ్ రిలే కార్యక్రమం పల్లె పల్లెలో గ్రామీణ యువ క్రీడా ప్రతిభకు ఒక కొత్త ఉత్సాహాన్ని ఇచ్చే విధంగా కొనసాగుతుందని, ఆయా జిల్లాలకు సంబంధించిన క్రీడాకారులు పీఈటీలు క్రీడా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొంటారని అయన తెలిపారు.

జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు

వివిధ శాఖలసహకారంతో,జిల్లా యువజన క్రీడాభివృద్ధి శాఖ సమన్వయంతో క్రీడాకారుల యువత భాగస్వామ్యంతో ఈ టార్చ్ రిలే కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని,గ్రామీణ క్రీడాకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఒక యజ్ఞం లా సీఎం కప్ నిర్వహిస్తుందని ఆయన వివరించారు

# కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు వెయిటేజీ ఇవ్వాలి

**- టీయుఎంహెచ్ఇయూ డిమాండ్**




హైదరాబాద్: స్టాఫ్ నర్స్ కోర్సులు పూర్తి చేసిన కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు సెప్టెంబర్ 18న విడుదల చేసిన నోటిఫికేషన్ లో వెయిటేజీ ఇవ్వాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, నగర అధ్యక్షులు జె.కుమారస్వామి, రాష్ట్ర కార్యదర్శి బి.కిరణ్మయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి నియమితులై గత 17 ఏండ్లుగా కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహిస్తూ రెగ్యులరైజేషన్ కోసం ఎదురు చూస్తున్నారని వారు తెలిపారు. వీరిలో చాలా మందికి జీఎన్ఎం అర్హత ఉందని స్పష్టం చేశారు. జీఎన్ఎం కోర్సు పూర్తి చేసి కాంట్రాక్ట్ ఏఎన్ఎంలుగా పని చేస్తున్నారని తెలిపారు. గతేడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు రెగ్యులరైజేషన్ కోసం సమ్మె చేస్తే గత ప్రభుత్వం త్రీమెన్ కమిటీ వేసి చేతులు దులుపుకుందని గుర్తుచేశారు. ఆ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసిందనీ, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కాంట్రాక్ట్ ఏఎన్ఎంల రెగ్యులరైజేషన్ కోసం కృషి చేయాలని కోరారు.

నోటిఫికేషన్‌లో ఏఎన్ఎంలకు వెయిటేజీ ఇచ్చి రెగ్యులర్ అయ్యేందుకు చర్యలు తీసుకోవాలనీ, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

# రోడ్డు పనులు పూర్తిచేయాలి

**- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం పై గ్రామస్తుల ఆందోళన**

వెంకటాపురం: రెండేండ్ల కిందట ప్రారంభించిన రోడ్డు పనులు ఇప్పటికీ పూర్తిచేయకపోగా, ఇసుక లారీలు నిలుపుదల చేస్తేనే రోడ్డు మరమ్మతులు చేపడతానంటూ కాంట్రాక్టర్ బుకాయించడంతో గ్రామస్తులు రాస్తోరోకో చేశారు. ఈ సంఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో బుధవారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వెంటకటాపురం మండల కేంద్రం నుంచి నిత్యం వందల సంఖ్యలో ఇసుక లారీల రాకపోకలు ఈ రోడ్డు గుండా వస్తూ ఉంటాయి. దాంతో రోడ్డు మొత్తం గుంతలు పడి దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో బుధవారం వెంకటాపురం మండల కేంద్రంలో రోడ్డుపై దుమ్ము కారణంగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు వేపచెట్టు సెంటర్ వద్ద ఢ కొన్నాయి. దాంతో రోడ్డు మరమ్మతులు ఎప్పుడు పూర్తి చేస్తారంటూ ఆర్అండ్‌బీ అధికారులు, రోడ్డు కాంట్రాక్టర్‌ను వెంకటాపురం గ్రామస్తులు నిలదీశారు. ఇసుక లారీలు నిలుపుదల చేస్తేనే రోడ్డు మరమ్మతులు చేపడుతామని కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో వేపచెట్టు సెంటర్ వద్ద భద్రాచలం-వెంకటాపురం ప్రధాన రహదారిపై గ్రామస్తులు బైటాయించి.. రెండు గంటలకు పైగా ఆందోళన చేపట్టారు. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అధికారులు.. రోడ్డు కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. కాగా, గతంలో ఇసుక లారీల వల్ల వచ్చే దుమ్ము తగ్గించడం కోసం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఇసుక కాంట్రాక్టర్లు ట్యాంకర్లను ఏర్పాటు చేసి రోడ్లపై నీటితో తడిపేవారు. ఈ ఏడాది ఇసుక కాంట్రాక్టర్లు ప్రధాన రహదారిపై నీటిని తడపకుండానే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దాంతో ప్రధాన రహదారిపై దుమ్ము చేరి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ములుగు జిల్లా కలెక్టర్ స్పందించి ఇసుక కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి మండల కేంద్రంలోనైనా ప్రధాన రహదారిపై ట్యాంకర్లతో నీరు పట్టించి దుమ్ము సమస్య తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.



# రాజస్థాన్ కేంద్రంగా సైబర్ నేరాలు

హైదరాబాద్: అదంటే సినిమా కాబట్టి కాస్త లిబర్టీస్ ఉంటాయి. కానీ రియల్ లైఫ్ లో అలాంటి సంఘటన జరిగింది. చదువుతుంటే ఆశ్చర్యం అనిపించినప్పటికీ ఇది ముమ్మాటికి నిజం. ఇటీవల కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. జేబు తెలియకుండా పర్స్ కొట్టేసే థియరీని సైబర్ దొంగలు విజయవంతంగా అమలు చేస్తున్నారు. అయితే సైబర్ నేరగాళ్ల బారిన పడి కేవలం నిరక్షరాస్యులు మాత్రమే కాదు, చదువుకున్న వాళ్ళు కూడా మోసపోతున్నారు. డబ్బులను నష్టపోతున్నారు. షేర్ మార్కెట్ అని, క్రిప్టో కరెన్సీ అని, మీ ఇంట్లో మాదకద్రవ్యాలు ఉన్నాయని.. ఇలా రకరకాల కారణాలు చెప్పి సైబర్ మోసగాళ్ళు మోసం చేస్తున్నారు. ఇందుకోసం మ్యూల్ ఖాతాలు వాడుకుంటున్నారు. అలా డబ్బును ఆ ఖాతాల్లోకి మళ్లించుకుని.. ఆ తర్వాత డ్రా చేసుకుంటున్నారు. పోలీసులు రెస్పాండ్ అయ్యేలోపు తమ పని సులభంగా కానిచ్చేస్తున్నారు.. అయితే ఇటీవల తెలంగాణ సైబర్ పోలీసులకు ఈ తరహా ఫిర్యాదులు ఎక్కువ కావడంతో.. కొంతకాలంగా వారు సీరియస్ గా దృష్టి సారించారు. ఈ మోసాలు ఎక్కడ నుంచి జరుగుతున్నాయి? ఎవరు చేస్తున్నారు? ఏ ప్రాంతం నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి? సైబర్ మోసగాళ్లు నగదును ఏ ఖాతాల మీదుగా తమ ఖాతాల్లోకి మళ్లిస్తున్నారు? అనే విషయాలపై పోలీసులు క్షుణ్ణంగా పరిశోధన సాగించగా మైండ్ బ్లాంక్ అయ్యే విషయాలు తెలిశాయి.ఈ మోసాలన్నీ కూడా రాజస్థాన్ కేంద్రంగా జరుగుతున్నట్టు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు గుర్తించారు. కొంతకాలంగా వారు పరిశోధన చేస్తుండగా వెల్లడైన వివరాల ఆధారంగా ఆపరేషన్ రాజస్థాన్ నిర్వహించారు. ఈ క్రమంలో వివిధ రూపాయలలో సైబర్ నేరాలకు పాల్పడిన 27 మంది నేరగాళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి భారీగా బ్యాంక్ చెక్ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు.. అయితే వీరంతా కూడా దేశంలోని వివిధ ప్రాంతాల్లో నెట్వర్క్ ఏర్పాటు చేసుకొని మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అమాయకులను బురిడీ కొట్టించి, లేని పోనీ భయాలను సృష్టించి నగదు తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నట్టు సమాచారం. అయితే వారి వద్ద నుంచి కీలక ఆధారాలు సేకరించిన పోలీసులు.. మరింత లోతుగా ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.. అయితే ఈ నేరాలకు పాల్పడుతున్న వారంతా టెక్నాలజీపై విపరీతమైన పట్టు ఉన్న వారిని పోలీసులు చెబుతుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.అయితే తెలంగాణ ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీ విభాగాన్ని అత్యున్నతంగా ఆధునికీకరించడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఒక ఫిర్యాదు అందిన వెంటనే స్పందిస్తున్నారు. సైబర్ మోసగాళ్లు డబ్బును తస్కరించకుండా ఉండేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వారు డబ్బులు డ్రా చేయకుండా బ్యాంకు ఖాతాలోనే ఫ్రీజ్ చేయించగలుగుతున్నారు..

సైబర్ పోలీసులు ఇలా ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినప్పటికీ.. మోసగాళ్లు మాత్రం తమ నేరాలను తగ్గించడం లేదు. పైగా కొత్త కొత్త రూపాలలో అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు.

# మరో ఎన్నికకు సిద్ధం

నల్గొండ: తెలంగాణ మరో ఎన్నికకు సిద్ధమవుతోంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా టీచర్ ఓటర్ల నమోదుకు షెడ్యూలు విడుదల చేసింది. వచ్చే నవంబరు ఆరవ తేదీ వరకు ఓట్లు నమోదు చేసుకోవాలని నిర్ణయించింది. నల్గొండ – ఖమ్మం ? వరంగల్ శాసన మండలి ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నిక జరగాల్సి ఉంది. ప్రస్తుతం ఈ నియోజయవర్గం నుంచి సీపీఎం అనుబంధ ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ నేత ఎ.నర్సిరెడ్డి ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆయన 2019లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించారు. కాగా, ఆయన పదవీ కాలం వచ్చే ఏడాది మార్చితో ముగియనుంది. కనుకనే, టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఫిబ్రవరిలోగా ఎన్నిక జరపాల్సి ఉంది.నల్గొండ – ఖమ్మం ? వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి జరగాల్సిన ఎన్నికకు ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేస్తోంది. వాస్తవానికి ఎమ్మెల్సీ పదవీకాలం మరో అయిదు నెలలు ఉన్నా ముందుగా ఓటర్ల నమోదు కోసం షెడ్యూలు విడుదల చేసింది. నవంబరు 6వ తేదీ వరకు ఓట్లు లేని కొత్త ఉపాధ్యాయులు తమ ఓట్లను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించింది.నవంబరు 23వ తేదీన ముసాయిదా ఓటరు లిస్టును ప్రకటిస్తారు. కాగా, ఎన్నికల కమిషన్ సోమవారం ఓటర్ల జాబితాను ప్రకటించింది. టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని పన్నెండు జిల్లాల పరిధిలో 20,888 మంది ఓట్లర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 13,658 మందికాగా 7,227 మంది మహిళా ఓటర్లు, ముగ్గురు ఇతర ఓట్లు ఉన్నారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానిన దక్కించుకునేందుకు ఆయా టీచర్ యూనియన్లు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. 2019 మార్చిలో జరిగిన ఎన్నికల్లో యూటీఎఫ్ నుంచి ఆ సంఘం రాష్ట్ర నాయకునిగా ఉండిన ఎ.నర్సిరెడ్డి గెలిచారు. మరో వైపు పీఆర్టీయూలో వచ్చిన చీలికలు, రెబల్ అభ్యర్థుల వల్ల యూటీఎఫ్ గెలుపు తేలికైంది.అంతకు ముందు పీఆర్టీయూ నుంచే ఎమ్మెల్సీగా పనిచేసిన నల్గొండ జిల్లాకు చెందిన పూల రవీందర్ మొదట కాంగ్రెస్ కు అనుబంధంగా ఉండడంతో ఆ పార్టీ మద్దతుతోనే గెలిచారు. కానీ, ఆ తర్వాత పూల రవీందర్ కాంగ్రెస్ వైపు నుంచి బీఆర్ఎస్ కు దగ్గరయ్యారు.వాస్తవానికి టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరిగేవే. కాకుంటే ఆయా రాజకీయ పార్టీలకు అనుబంధ సంఘాలుగానో, లేదా మద్దతుతోనే ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. బీఆర్ఎస్ దగ్గర అయిన పూల రవీందర్ సిట్టింగ్ ఎమ్మెల్సీగా పోటీ చేసి యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు.పూల రవీందర్ ఓటమిలో ఆయన సొంత సంఘం పీఆర్టీయూ నుంచే వరంగల్ జిల్లాలకు చెందిన సర్వోత్తమ్ రెడ్డి తిరుగుబాటు అభ్యర్థిగా బరిలో నిలవడం ప్రధాన భూమిక పోషించింది. ఈ సారి జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధానంగా సిట్టింగ్ ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న యూటీఎఫ్, పీఆర్టీయూ అదే మాదిరిగా బీజేపీ అనుబంధ టీయూపీఎస్ ఉపాధ్యాయ సంఘాలు ప్రధాన పోటీదారులుగా ఉండనున్నారు.ఉపాధ్యాయ వర్గాల సమాచారం మేరకు యూటీఎఫ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి రెండో సారీ పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. పీఆర్టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, నల్గొండ జిల్లాకే చెందిన మరో నాయకుడు సుంకరి బిక్షం గౌడ్ మధ్య టికెట్ కు పోటీ ఉండే సూచనలు ఉన్నాయి.నల్గొండ – ఖమ్మం ? వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో పేరుకు పన్నెండు జిల్లాలు ఉన్నా ఉమ్మడిగా చూసినప్పుడు మూడు జిల్లాలదే ప్రధాన భాగం. కొత్తగా ఏర్పడిన జిల్లాల మేరకు వరంగల్ అర్బన్ జిల్లాలో అత్యధికంగా 4,315 మంది ఓటర్లు ఉండగా, నల్గొండలో 3,859 మంది, ఖమ్మం జిల్లాలో 3,634, సూర్యాపేట 2,183, భద్రాద్రి కొత్తగూడెం 2,043, యాదాద్రి భువనగిరి 1,320, మహబూబాబాద్ 1,087, జనగాం 853, వరంగల్ రూరల్ 805, ములుగు 464, సిద్దిపేట 163, భూపాలపల్లి 162 మంది ఓటర్లు ఉన్నారు.నవంబరు నెలాఖరులోగా కొత్త ఓటర్ల నమోదు తర్వాత కొత్త జాబితా విడుదల కానుంది. కాగా, సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు యూటీఎఫ్ ప్రయత్నిస్తుండగా, కాంగ్రెస్ కు అనుబంధంగా ఉండే పీఆర్టీయూ ఈ సారి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో చేజారిన తమ స్థానాన్ని తిరిగి దక్కించుకునేందుకు వ్యూహాత్మకంగానే ఎత్తులు వేస్తోంది.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజలు భయపడే పరిస్థితి

**– ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ప్రజలు చూసి భయపడే పరిస్థితి**

**– మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

పెద్దపల్లి ప్రతినిధి : ప్రజలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ప్రజలు చూసి భయపడే పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా సంబంధించిన దాదాపు లక్షమంది రైతులకు రుణమాఫీ కాలేదని, ప్రభుత్వం వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ అందుబాటులో లేకపోవడం తో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ ని కలిసి జిల్లా రైతుల ఆవేదనను వ్యక్తం చేసి, ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని వినతి పత్రాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ దాదాపు పెద్దపల్లి జిల్లా మొత్తం మీద రుణమాఫీ కావలసిన రైతుల సంఖ్య 1 లక్ష 52 వేల 184 ఉండగా, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది 51,393 మంది రైతులకు మాత్రమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం సమావేశంలో రాష్ట్రంలో మొత్తం మంది రైతులకు రుణమాఫీ జరిగిపోయిందనీ, మా ప్రభుత్వం గొప్పగా చేసినమని స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పై ఇప్పుడు లెక్కకు లేని ఆంక్షలు పెడుతోందని అన్నారు. ఇది ఈ పెద్దపల్లి జిల్లా కు సంబంధించిన విషయం కాదనీ, రాష్ట్రంలోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రకటించింది 49 లక్షల మందికి ఎంతమందికి ఇచ్చింద్రు రుణమాఫీ 23 లక్షల 25 వేల మంది ఇచ్చిండని, మిగిలిన రైతుల పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు గడుస్తోన్న ఒక్క స్కీం అయిన సరిగా అమలు జరగడం లేదనీ గుర్తు చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రుణమాఫీ, రైతుభరోసా, మహిళలకు ఇచ్చే రూ.2500, ముసలవ్వలకు ఇచ్చే రూ.4 వేలు, రూ.500 రూపాయల బోనస్, కళ్యాణ లక్ష్మీ తులం బంగారం, ఇవన్నీ ఎక్కడికి పోయాయని ఎద్దేవా చేశారు. అన్ని మాయ మాటలు, దొంగ మాటలు, దగుల్బాజీ మాటలు మాట్లాడుతూ ఒక వైపు హైడ్రా పేరు మీద హైదరాబాద్ లోని భవనాలనుకోల్సివేయడం దయానంగా మారిందన్నారు. ఆనాడు ఈ రేవంత్ రెడ్డి నువ్వే చెప్పావు కదా ఒక నిర్మాణాన్ని కూలగొట్టే ముందు దానికి చట్టాలు ఉన్నాయనీ, ఒకవేల రెగ్యులరైజ్ చేయాలనుకుంటే కూడా చేయవచ్చని చెప్పావు కదా అని కొప్పుల ఈశ్వర్ గుర్తుచేశారు. ఇప్పుడు వేరే దేశం ఇంకో దేశం పై దాడి చేసినట్లు దొంగల్లాగా తెల్లవారుజామున ఎవరు లేని సమయంలో హైడ్రా పేరు తో ఇండ్లను కూల కొడుతున్నావు ఇదో నీకు న్యాయమా..? నీ తప్పుడు నిర్ణయాల వల్ల ఎన్ని కుటుంబాలు రోడ్డున పడ్డారని, లక్షల మంది ఆవేదనలు వినపడటం లేదా అని ప్రశ్నించారు. 10 సంవత్సరాల కెసిఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం ఇలాంటి పరిస్థితి ఉందా అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 23 సార్లు డిల్లీ పోయచ్చింద్రు ఈరోజు కూడా డిల్లీ లోనే ఉన్నాడు ఏం సాందించిండో తెలియదు.. కానీ కెసిఆర్ చెప్పింద్రు మోసపోతే గోస పడతరని, కాని ఎవరు నమ్మలేదు కాంగ్రెస్ పార్టీ చెప్పిన అబద్ధాలను నమ్మి ఓటు వేస్తిరన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అస్తవ్యస్తమైన పరిపాలన నడుస్తోందన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లో రెసిడెన్షియల్ హాస్టల్లు నాష్టమైపోయాయి. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అందాకారం అయిపోయిందన్నారు.

ఆసుపత్రి పోతే మందులు లేవు కెసిఆర్ పాలనలో ప్రసవాలు 80 శాతం ప్రభుత్వం ఆసుపత్రిలో జరిగాయి.. ఈరోజు 33 శాతానికి తగ్గిపోయాయని అన్నారు. ఈ రాష్ట్రంలో దుర్మార్గమైన పాలనా కొనసాగుతున్నది. దీనికి చరమగీతం పాడాలంటే తప్పకుండా రైతు లోకమంతా ఏకం కావాలన్నారు. ఇది బిఆర్ఎస్ పార్టీ సమస్య కాదు. ఇది లక్షల మంది రైతుల సమస్య ఈ రాష్ట్రలో ఉన్నటువంటి అన్ని వర్గాల ప్రజల సమస్య కాబట్టి ఈ దుర్మార్గమైన ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వేడుకగా ఇది అంతం కాదు ఆరంభం అని కొప్పుల ఈశ్వర్ ముఖ్యమంత్రి ని హెచ్చరించారు. రైతు ఏడ్చినా రాజ్యం ఎన్నడూ కూడా బాగుపడలేదు. ఈ రాష్ట్రంలో రైతులను ఏడిపిస్తున్నావన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓ పాపకారి ప్రభుత్వం అని ప్రజలకు తెలిసిపోయిందని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ , పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, మాజీ జెడ్పిటిసి గంట రాములు, నాయకులు దాసరి ఉష, మార్కు లక్ష్మణ్, మాజీ ఎంపీపీలు నునేటి సంపత్, బాలాజీ రావు, నాయకులు బండారి శ్రీనివాస్, అన్ని మండలాల మండల అధ్యక్షులు పట్టణ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ రైతుబంధు కన్వీనర్లు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున రైతు సోదరులు పాల్గొన్నారు.

# ఆ 10 నియోజకవర్గాల్లో... దిక్కెవరు...

హైదరాబాద్: ఎమ్మెల్యేలు వెళ్లిన నియోజకవర్గాల్లో మాత్రం ఇన్‌చార్జ్‌లను నియమించడం లేదు బీఆర్ఎస్ పార్టీ. దానం నాగేందర్‌తో మొదలైన వలసల పర్వం..తెల్లం వెంకట్రావు వరకు కొనసాగింది. అయిందేదో అయిపోయింది.ఎమ్మెల్యేలు పోతే పోయారు. ఎవరో ఒక నేతను అయితే నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌ను నియమించాలి కదా అంటున్నారు క్యాడర్. లీడర్లు లేకపోతే సర్లే అనుకోవచ్చు. నియోజకవర్గం ఇన్‌చార్జ్ పగ్గాలు చేపట్టి ముందుండి నడిపిస్తామని నేతలు ముందకొస్తున్నా.. బాధ్యతలు అప్పగించకపోవడానికి కారణమేంటో అర్థం కావడం లేదంటోంది బీఆర్ఎస్ క్యాడర్.అందరి కంటే ముందు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వెళ్లారు. ఆయన హస్తం గూటికి చేరి కూడా మూడు నెలలు అయిపోయింది. ఇప్పటికీ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలను ఏ నేతకు అప్పగించలేదు గులాబీ పార్టీ హైకమాండ్. అలాగే స్టేషన్ ఘన్‌పూర్, శేరిలింగంపల్లి, భద్రాచలం, బాన్సువాడ, జగిత్యాల, గద్వాల్, చేవెళ్ల, పటాన్‌చెరు సెగ్మెంట్ల ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయారు.అయినా ఆ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను పెట్టలేదు బీఆర్ఎస్ అధిష్టానం. జంపింగ్ జపాంగ్స్ మీద విమర్శలు చేయడం..వేటు వేయించడం కోసం లీగల్ ఫైట్ చేయడమే తప్ప.. ఎమ్మెల్యేలు వెళ్లిపోయిన సెగ్మెంట్లలో పార్టీ పటిష్ఠతపై మాత్రం ఫోకస్ చేయడం లేదంటున్నారు కార్యకర్తలు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేకపోవడం తమకు ఇబ్బందికరంగా మారిందని అంటున్నారు. ధర్నాలు, రాస్తారోకోల్లో అరెస్ట్ అయితే తమను విడిపించే నాయకుడు ఎవరని ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో పార్టీ మంచీ చెడును చూసుకునేదెవరో అర్థం కావడం లేదని అంటోంది ఆ పది నియోజకవర్గాల గులాబీ క్యాడర్.పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పార్టీని వీడటంతో..నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతల కోసం చాలామంది నేతలు పోటీ పడుతున్నారు. పార్టీలో సీనియర్లుగా ఉన్న కొలను బాల్‌రెడ్డి, సోమిరెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్‌లు నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతల కోసం హరీశ్‌రావును కలిసి ప్రయత్నాలను చేసుకుంటున్నారు. గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ వీడిన తెల్లారే హరీశ్‌రావు పటానుచెరులోని ఆదర్శ్‌రెడ్డి ఇంట్లో ముఖ్య కార్యకర్తల సమావేశం పెట్టి మనోధైర్యం నింపే ప్రయత్నం చేశారు.నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉందని, గూడెం మహిపాల్ రెడ్డి పార్టీ వీడినా నష్టం లేదని తాను అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఇక అప్పటి నుంచి మెట్టు కుమార్ యాదవ్, ఆదర్శ్ రెడ్డి, కొలను బాల్ రెడ్డి, సోమిరెడ్డి తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఎవరికి వారు తమ సీనియార్టీని, అర్హతలను హరీశ్‌కు వివరిస్తూ నియోజకవర్గ బాధ్యతలు దక్కించుకోవాలని చూస్తున్నారు. ఒక్క పటాన్‌చెరులోనే కాదు..మిగతా 9 నియోజకవర్గాల్లో కూడా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఆశిస్తున్నవాళ్లు చాలా మందే ఉన్నారు. అయితే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తే..ఆ నేత ఎమ్మెల్యే టికెట్ ఆశించే అవకాశం ఉంటుంది. అందుకే నియోజకవర్గ ఇంచార్జ్‌ల విషయంలో పార్టీ ఆచితూచి వ్యవహరిస్తుందన్న ప్రచారం ఉంది.జంప్ అయిన పది మంది ఎమ్మెల్యేల్లో కొందరిపై వేటు పడితే..వారిపై బలమైన అభ్యర్థులను బరిలోకి దించి..తమను కాదని వెళ్లిన నేతలను ఓడించి తీరాలని కసిగా ఉంది బీఆర్ఎస్. అందుకే వెంటనే ఇన్‌చార్జ్‌లను నియమించడం లేదన్న టాక్ వినిపిస్తోంది. లీగల్ ఫైట్‌లో ఏదో ఒక అంశం తేలుతుందని.. అనర్హత పడే అవకాశం లేకపోతే..త్వరలోనే ఇన్‌చార్జ్‌ల నియామకం ఉంటుందని చెబుతున్నారు గులాబీ పార్టీ లీడర్లు.

# పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆర్ఎంపిలు

**దత్తాత్రేయనగర్లో టిటి ఇంజక్షన్ వికటించి వృద్ధురాలి నరకయాతన**

మేడ్చల్: పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న ఆర్ఎంపీ డాక్ట ర్లతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. వచ్చిరాని వైద్యం చేయడంతో అది కాస్త వికటించి ప్రాణాలు దక్కించుకోవడం కోసం అప్పుల పాలయ్యి పెద్ద ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం చింతల్, దత్తాత్రేయ నగర్ లో నివాసముండే పుష్ప (65) వృద్ధురాలు అనా రోగ్య సమస్యలతో ఇటీవల వైద్యం కోసం స్థానికంగా ఉన్న తేజ క్లినిక్ వెళ్ళింది. అక్కడ ఆమెను పరీక్షించిన ఆర్ఎంపి డాక్టర్ మూర్తి, వృద్ధురాలు కి సురక్షితం లేని టిటి ఇంజక్షన్ తో 'వైద్యం చేశారు. అది కాస్త వికరించడంతో ఆమె చేతికి, తుంటి కి దురద ఏర్పడి రంధ్రాలు పడేవిధంగా తయారయింది. నాసిరకం ఇంజక్షన్లతో చికిత్స అందించటంతో, వృద్ధురాలు పుష్ప కి తుంటి పై భాగం లో రంధ్రాలు పడ్డాయాని స్థానికులు తెలుపారు. వైద్యం వికటించడం వల్లనే వృద్ధురాలు పుష్ప తీవ్ర అనారోగ్యం బారిన పడిం దని, తను వొంటరి గా ఉండే మహిళ కావడం తో స్థానికులే మెరుగైన చికిత్స నిమిత్తం సూరారం లోని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మరో ఘటన జరగకుండా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇలాంటి కనీస అవగాహన లేకుండా, క్లినిక్ లో పేరుతో చలామణి అవుతున్న ఆర్ఎంపి డాక్టర్ల పై ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవా లని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా కుత్బుల్లాపూర్ లో గల్లీకి ఒకటి చొప్పున ఏర్పడిన ఆర్ఎంపీ వైద్యుల దందాను ప్రభుత్వం అరికట్టాలని పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అనుమతి లేని డాక్టర్లను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.

# స్నేహితులతో కలిసి.. యువతిపై సామూహిక లైంగికదాడి

**– వరంగల్‌లో ఆలస్యంగా వెలుగులోకి..**



కాశిబుగ్గ: వరంగల్‌లో ఓ యువతిపై స్నేహితులతో కలిసి సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్నేహం ముసుగులో యువతి స్నేహితుడే.. అతని మిత్రులతో కలిసి ఈ ఘటనకు పాల్పడ్డాడు. ఇంతేజర్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన యువతి నగర శివారులోని ఓ కళాశాలలో డీ ఫార్మసీ చదువుతూ ప్రయివేట్ హాస్టల్‌లో ఉంటుంది. ఆమె స్వస్థలానికి చెందిన ఇద్దరు యువకులు నగరంలో బీటెక్ చదువుతూ స్థానికంగా ఓ హాస్టల్‌లో ఉంటున్నారు. కాగా, ఒకే ఊరు కావడంతో వారు ముగ్గురు మంచి స్నేహితులయ్యారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 15వ తేదీన వారు ముగ్గురు సరదాగా బయటకు వెళ్దామని అనుకోగా, వారు వచ్చిన కారులో మరో యువకుడు ఉండటంతో ఆమె నిరాకరించింది. దాంతో ఆమెను బలవంతంగా కారులో ఎక్కించి వరంగల్ నగరానికి తీసుకొచ్చారు. వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఓలాడ్జిలో రెండు గదులు తీసుకొని ఓగదిలో యువతి, మరో గదిలో వారున్నారు. కాగా, యువకుల గదిలో బీర్లు తాగిన వారు.. మద్యం మత్తులో యువతి గదిలోకి వెళ్లి ఆమెతో బలవంతంగా బీర్లు తాగించి ఆమెపై ముగ్గురూ లైంగికదాడికి పాల్పడ్డారు. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన యువతి.. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దాంతో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. కాగా, లాడ్జిలోని సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకోగా, మరొకరు పరారీలో ఉన్నట్టు సమాచారం.

# సామాజిక, ఆర్థిక, సమానత్వ సాధనే కేవీపీఎస్ లక్ష్యం

**– కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ**

**– ఘనంగా సంఘం 26వ వార్షికోత్సవం**



తుర్కయంజాల్: తరతరాలుగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, అసమానతలను అంతం చేయడానికి సమానత్వ సాధనే లక్ష్యంగా కేవీపీఎస్ ఏర్పడిందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ అన్నారు. బుధవారం కేవీపీఎస్ 25వ వార్షికోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మండలం రాగన్నగూడలోని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా కార్యాలయం వద్ద సంఘం జెండాను జాన్‌వెస్లీ ఎగరవేశారు. అనంతరం నగర కార్యదర్శి మస్కు ప్రకాశ్‌కరత్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అంటరానితనం, కులవివక్షకు వ్యతిరేకంగా ఒక చారిత్రాకవసరం గా1998లో కేవీపీఎస్ ఏర్పడిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కులవివక్ష, అంటరానితనంపై వందలాది గ్రామాల్లో వేలాది మంది కార్యకర్తలతో సర్వేలు, అధ్యయనాలు నిర్వహించి సుమారు 128 రకాల కుల వివక్ష రూపాలను వెలికితీసినట్టు తెలిపారు. వందల సంఘాలను ఐక్యం చేసి.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటు కోసం దశలవారీ పోరాటాలు నిర్వహించామని, జస్టిస్ పుల్లయ్య కమిషన్ సాధించిన ఘన చరిత్ర కేవీపీఎస్‌కు ఉందన్నారు. 2004 నుంచి 2013 వరకు సుమారు పదేండ్లు.. పోరాడి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం సాధించామని గుర్తుచేశారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రాజీలేని ఉద్యమాలు నిర్వహించి బాధితులకు బాసటగా సంఘం నిలబడిందన్నారు. దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేలా పోరాడుతున్నట్టు చెప్పారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు రక్షణ కల్పించాలని, కులదురహంకార హత్యలను అరికట్టాలని ఉద్యమాలు నిర్వహించినట్టు తెలిపారు. చర్మకారుల, డప్పు కళాకారుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు దాటుతున్నా నేటికీ గ్రామాలు, పట్టణాల్లో కులవివక్ష విలయతాండవం చేస్తోందని, అరికట్టాల్సిన పోలీసులు, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఇంకా దళితులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయని విమర్శించారు. పదేండ్ల మోడీ పాలనలో దళితులు, గిరిజనులు, మహిళలపై 300 రెట్లు దాడులు పెరిగాయని తెలిపారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన మోడీ ప్రభుత్వం మనుధర్మ శాస్త్రాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తూ భారత సెక్యులర్ విలువలను దెబ్బతీస్తోందని ఆరోపించారు.

విద్వేషాలను రెచ్చగొట్టడం ద్వారా దేశ ప్రజల మధ్య ఐక్యతను చెదరగొట్టడమే కాక అభద్రత సృష్టిస్తుందన్నారు. మతసామరస్యం కోసం, కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా సామాజిక, సమానత్వం కోసం కేవీపీఎస్ మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కాడిగాళ్ల భాస్కర్, జిల్లా అధ్యక్షులు బొడా సామేల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్ర మోహన్, జిల్లా ఉపాధ్యక్షులు జగదీష్, కవిత, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ పగడల యాదయ్య, శోభన్, సీఐటీయూ జిల్లా నాయకులు కిషన్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మూసీ ప్రక్షాళనకు అడ్డుపడుతున్న బీఆర్ఎస్

హైదరాబాద్: హైడ్రా, మూసీ ప్రక్షాళనను ఎందుకు బీఆర్ఎస్ అడ్డుకుంటోంది? నిజంగా పేదల తరపున ఆ పార్టీ పోరాటం చేస్తుందా? కొంతమందిని కాపాడేందుకు పేద, మధ్య తరగతి వర్గాల వారిని రెచ్చగొడుతుందా? వీటి పేరిట దోచుకున్నదెంత? ఇవే ప్రశ్నలు చాలామందిని వెంటాడుతోంది.అత్యంత కాలుష్యమైన నది ఏదంటే ముందుగా గుర్తు కొచ్చేది మూసీ. ఈ విషయాన్ని అనేక పర్యావరణ రిపోర్టులు చెబుతున్నాయి. ఈ లెక్కన మూసీ నది ఏ స్థాయిలో కలుషితమైందో అర్థమవు తోంది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో మూసీ వెంబడి దాదాపు 26 లక్షల మంది జీవిస్తున్నారు. కాలువ వెంబడి కేన్సర్ కారణాలు ఆర్సెనిక్, క్రోమియం, కాపర్, నికెల్, లెడ్ వంటి రసాయనాలను గుర్తించినట్టు ఎన్జీఆర్ఐ పేర్కొంది.హైదరాబాద్‌లో చెరువుల ఆక్రమణలో 80 శాతం బీఆర్ఎస్ నాయకులు, బిల్డర్లే ఉన్నారని ఆరోపించారు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్. దీనిపై సోషల్ మీడియాలో లేనిపోని అబద్దాలు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఇప్పటివరకు మూసీ పరివాహక ప్రాంతాల్లో ఒక్క గుడిసె తీయలేదన్నారు.నది మధ్యలో ఉన్న కొన్ని కట్టడాలు తొలగిస్తున్నారని చెప్పుకొచ్చారు టీపీసీసీ. మూసీ కాలువకు కుడి, ఎడమ వైపు ఇళ్లులు తొలగించలేదన్నారు. గడిచిన పదేళ్లలో ఎంత కలుషితమైందో స్వయంగా రిపోర్టు చెబుతున్నాయి. ఆక్రమణల వెనుక బీఆర్ఎస్ నేతలతో కొందరు బీజేపీ నేతలున్నారని గుర్తు చేశారాయన.మూసీ వ్యవహారంలో బీఆర్ఎస్ వ్యవహారశైలిని తప్పుబట్టారు మరో కాంగ్రెస్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి. మూసీ ప్రక్షాళనను అడ్డుకోడమంటే ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు మరణ శాసనం రాయడమేనన్నారు. మూసీ పేరు చెప్పి కారు పార్టీ వెయ్యి కోట్లు రూపాయలు వెనుకేసుకుందన్నది ప్రధాన ఆరోపణ.ఈ కాలువ ద్వారా పండే పంటలను ఎవరూ తినే పరిస్థితి లేదన్నారు రాజగోపాల్ రెడ్డి. కాటేదాన్, పటాన్ చెరు, జీడిమెట్ల, కూకట్‌పల్లి, సనత్ నగర్, నాచారం, ఏరియాల నుంచి నేరుగా విష రసాయనాలు వదిలేయడం వల్ల మూసీకి ప్రధాన సమస్యగా మారిందన్నారు. దీనికితోడు హెచ్ఎండీఏ పరిధిలో ఇళ్ల నుంచి వచ్చే డ్రైనేజీ సైతం మూసీలో కలుస్తోందన్నారు. లక్షల మంది జీవితాలతో బీఆర్ఎస్ ఆటలాడుతోందని మండిపడ్డారు. మనీ రాజకీయాలు వద్దని కోరారు ఆయన.

# జడ్జి వద్దంటూ న్యాయవాదుల ఆందోళన

లక్నో: న్యాయమూర్తిని న్యాయం చేసే దేవుడిగా భావిస్తారు. అందుకే భారత దేశంలో ఇప్పటికీ కోర్టులపై విశ్వాసం ఉంది. ఎలాంటి ఒత్తిడులకు తలొగ్గకుండా కోర్టుల్లో అయితేనే న్యాయం జరుగతుందని చాలా మంది విశ్వసిస్తారు. అయితే జాప్యం కారణంగా చాలా మంది ఏళ్లుతరబడి కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇదిలా ఉంటే.. న్యాయ మూర్తికి, కక్షిదారులకు మధ్య న్యాయవాదులు వారధిగా ఉంటారు. బాధితుల తరపున వాదనలు వినిపిస్తారు. న్యాయమూర్తి చెప్పే తీర్పులను గౌరవిస్తారు. కట్టుబడి ఉంటారు. అయితే అలాహాబాద్ హైకోర్టు న్యాయవాదులు మాత్రం జడ్జిపై ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు బార్ అసోసియేషన్ కూడా సుప్రీం కోర్టును అభ్యర్థించింది. ఈమేరకు ఒక తీర్మానాన్ని కూడా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు పంపాలని నిర్ణయించింది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ న్యాయవాది మిశ్రాపై క్రిమినల్ ధిక్కార చర్యలకు ఆదేశించింది. అతని చర్యలు దాని గౌరవాన్ని తగ్గించగలవని కోర్టు పేర్కొంది, ప్రధాన న్యాయమూర్తికి రిఫెరల్‌ను ప్రాంప్ట్ చేసింది. జస్టిస్ సంగీతా చంద్ర ఇచ్చిన ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ అలాభాబాద్ బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. న్యాయ సంఘాల నుంచి మద్దతు బార్ అసోసియేషన్ మొదట జస్టిస్ సంగీతా చంద్ర కోర్టును బహిష్కరించాలని నిర్ణయించింది. అయినప్పటికీ, చాలా మంది న్యాయ వాదులు ఆమె ఉన్న కోర్టులో తాము పనిచేయలేమని వాదించారు. అనంతరం కోర్టు విచారణలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవాలని సంఘం నిర్ణయించింది. యూపీ బార్ కౌన్సిల్ కూడా అలహాబాద్ న్యాయవాది మిశ్రాకు మద్దతు తెలిపింది. జస్టిస్ సంగీతా చంద్రను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆమె బదిలీ పూర్తయ్యే వరకు ఎలాంటి న్యాయపరమైన పని చేయకూడదని కౌన్సిల్ పట్టుబట్టింది. సంగీతా చంద్రను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలని అభ్యర్థిస్తూ సుప్రీం కోర్టుకు లేఖ రాయాలని అలహాబాద్ బార్ అసోసియేషన్ నిర్ణయించింది. బార్ అధ్యక్షుడు అనిల్ తివారీ, తీర్మానాలను వెంటనే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపే బాధ్యత అసోసియేషన్ కార్యదర్శికి ఉందని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ వారి తీర్మానం కాపీని సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ద్వారా భారత ప్రధాన న్యాయమూర్తికి పంపింది. జస్టిస్ చంద్రను బదిలీ చేయాలని, అప్పటి వరకు న్యాయపరమైన విధులు కేటాయించవద్దని డిమాండ్ చేశారు. ఉంటే.. ఈ పరిస్థితి దేశంలో న్యాయవాదులు, న్యాయమూర్తుల మధ్య ఉద్రిక్తతకు దారితీస్తోంది. అలభాబాద్ కోర్టు సీనియర్ న్యాయవాది న్యాయస్థానాన్ని 'కుంభకోణం' చేశాడని కోర్టు కార్యకలాపాల నిర్వహణపై అస్పష్టతలను ప్రదర్శించడం ద్వారా 'దాని గౌరవాన్ని తగ్గించాడు' అని గుర్తించిన తర్వాత డివిజన్ బెంచ్ (జస్టిస్ బ్రిజ్ రాజ్ సింగ్‌తో కూడి) ఈ సూచన చేసింది. టెండర్ కోసం పిటిషనర్ సాంకేతిక బిడ్‌ను తిరస్కరిస్తూ లక్నో నగర్ నిగమ్ జారీ చేసిన రెండు ఉత్తర్వులను సవాలు చేస్తూ డివిజన్ బెంచ్ రిట్ పిటిషన్‌ను విచారిస్తున్నప్పుడు సీనియర్ న్యాయవాది ఎస్‌సీ. మిశ్రాపై ధిక్కార చర్యను సిఫార్సు చేస్తూ ఆర్డర్ ఆమోదించబడింది. సీనియర్ న్యాయవాది ఇ మిశ్రా తరపున పిటిషనర్ వాదిస్తూ ఎల్ఎన్ఎన్/ఎల్ఎంసీ వారు అర్హులుగా భావించాలని, పిటిషనర్ కోసం ఫైనాన్షియల్ బిడ్‌ను తెరవడానికి అనుమతించాలని వాదించారు. సెప్టెంబరు 25న జారీ చేసిన ఒక ఉత్తర్వులో, పిటిషనర్ సాంకేతికంగా అర్హత కలిగి ఉన్నట్లు గుర్తించిన మునుపటి టెండర్ నోటీసున, సవాలులో ఉన్న ప్రస్తుత టెండర్ నోటీసును కూడా రద్దు చేయడానికి సంబంధించిన రికార్డులను కోర్టు సమన్లు చేసింది. సెప్టెంబర్ 27న ఎల్ఎంసీ తరపున న్యాయవాది కోర్టు డిమాండ్ చేసిన రికార్డును సమర్పించడానికి మరికొంత సమయం కోరారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, నగర్ నిగమ్ అధికారుల తరపున వ్యవహరించిన తీరును విమర్శిస్తూ, తదుపరి విచారణను సెప్టెంబర్ 30కి వాయిదా వేయాలని కోర్టు కోరింది. అయితే ఈ సమయంలో విచారణ వాయిదాపై సీనియర్ న్యాయవాది (పిటిషనర్ తరపు న్యాయ వాది) అభ్యంతరం వ్యక్తం చేస్తూ నాగర్ నిగమ్ రికార్డును పరిశీలించ కుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పట్టుబట్టారు. విజయవంతమైన బిడ్డర్‌కు లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేయాలని ప్రతివాదులు భావిస్తున్నారని ఆరోపిస్తూ, అతను విషయం యొక్క ఆవశ్యకతను కూడా నొక్కి చెప్పాడు. దీనిపై సీనియర్ న్యాయవాది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఈరోజు తుది నిర్ణయం తీసుకుంటామని కోర్టులో నినాదాలు చేశారు. కోర్టు పట్టుబట్టినప్పటికీ, మెరిట్‌లపై వాదించడానికి అతను నిరాకరించాడు. ప్రతివాదులకు అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు జారీ చేయడానికి మొగ్గు చూపుతున్నందున తాను ఏమీ చెప్పదలచు కోలేదని పేర్కొన్నాడు. కోర్టు తన ఇష్టానుసారం ఏదైనా ఉత్తర్వును జారీ చేయవచ్చని మరియు విషయాన్ని కొట్టివేయవచ్చని ఆయన అన్నారు. సీనియర్ న్యాయవాది చేసిన అటువంటి ప్రకటనలకు ప్రతిస్పందనగా, అటువంటి ప్రవర్తన కోర్టు అధికారాన్ని బలహీనపరు స్తుందని మరియు కోర్టు కార్యకలాపాలకు సాక్ష్యమిచ్చే జూనియర్ లాయర్లకు ప్రతికూల ఉదాహరణను సెట్ చేయగలదని కోర్టు ఎత్తి చూపింది. అయితే, న్యాయస్థానం ఆదేశం మేరకు, సీనియర్ న్యాయ వాది అదే పద్ధతిలో కొనసాగడంతో, కోర్టు కార్యకలాపాల నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, వ్యక్తిగత దూషణలు చేస్తూ, అతనిపై క్రిమినల్ ధిక్కార చర్యలను ప్రారంభించాలని ప్రధాన న్యాయమూర్తికి కోర్టు సూచించింది.

## ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ

హైదరాబాద్: సేవరేజ్ ఓవర్ ఫ్లో, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ పెట్టింది. గాంధీ జయంతి సందర్భంగా ఈరోజు నుంచి 90 రోజుల వరకు హైదరాబాద్ నగరంలో వర్షం నీరు వృథాగా కాకుండా భూగర్భ జలాల పరిరక్షణకు స్పెషల్ డ్రైవ్ చేస్తున్నామని మంత్రి పొ?నం ప్రభాకర్ అన్నారు. వర్షం నీరు బయటికి పోకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలి. అపార్ట్మెంట్స్, కాలనీలు అందరూ పాటించాలి. మూడు నెలల్లో సేవరేజి సమస్య 30 శాతానికి తగ్గించాలన్నదే మా ఉద్దేశ్యం. జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షణ జరుగుతుంది. 1950 ఎంఎల్టీ మురుగు నీరు వస్తుంది..వాటిని ఎస్టీపీ ద్వారా శుభ్రత అయ్యే విధంగా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో పురుగుల గడ్లు

జగిత్యాల: జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం వల్లంపల్లి గ్రామంలోని అంగన్ వాడి కేంద్రంలో వచ్చిన గుడ్లల్లో పురుగులు రావటంతో తల్లిదండ్రులు షాక్ తిన్నారు. వల్లంపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి స్థానిక అంగన్వాడి సెంటర్ కి వెళ్లి గుడ్లు తీసుకొచ్చాడు. తెచ్చిన గుడ్లను విప్పి చూడగా పురుగులు ఉండడంతో ఒకసారిగా ఆందోళన చెందాడు. పిల్లలకు పౌష్టికాహారం కోసం అందించే గుడ్లలో పురుగులు రావడం, కుళ్ళిపోయిన గుడ్లు కనబడడంతో ఆవేదన వ్యక్తం చేశాడు, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కుళ్ళిపోయిన గుడ్లు ఇవ్వడం వల్ల పిల్లలకు తీవ్ర అనారోగ్యం చేస్తుందని చెపుతున్నాడు. తీసుకొచ్చిన గుడ్లను ఇంటిపక్క వాళ్లకు చూపించాడు. అంగన్వాడి కేంద్రాల్లో నాణ్యతలేని గుడ్లు పంపిణీ చేయవద్దని వారు తెలుపుతున్నారు.

# అడ్డంగా బుక్కైన సాహితీ లక్ష్మీనారాయణ..

హైదరాబాద్: 2019లో అమీన్ పూర్ శర్వాని ఎలైట్ పేరుతో ప్రీలాంచ్ డిపాజిట్లు సేకరించి శఠగోపం పెట్టిన తర్వాతే సాహితీ లక్ష్మీనారాయణ గురించి చాలా మందికి తెలిసింది. పొలిటికల్ లీడర్లు, సినిమా స్టార్లను ఈజీగా ఏమార్చిన ఘనత సాహితీ లక్ష్మీనారాయణది. అలాంటిది కామన్ మ్యాన్ పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. అందుకే తియ్యటి మాటలకు చాలా మంది డబ్బులు సమర్పించుకుని బలైపోయారు. టీటీడీ బోర్డ్ మెంబర్ దాకా వెళ్లాడంటే పరపతి ఏ స్థాయిలో పెంచుకున్నాడో అర్థమవుతుంది. 2021 సెప్టెంబర్ లో టీటీడీ బోర్డ్ మెంబర్ అయ్యారు బూదాటి లక్ష్మీనారాయణ. అప్పుడు సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేయడంతో టీటీడీ బోర్డ్ మెంబర్ పదవికి రాజీనామా చేశారు లక్ష్మీనారాయణ. కథ తవ్వితే చాలా పెద్దది మరి. లక్ష్మీనారాయణ స్వస్థలం చిలకలూరిపేట. చిన్న బట్టల షాపుతో వ్యాపారం మొదలెట్టారు. అక్కడ ఐపీ పెట్టేసి గుడ్ బై చెప్పేశారంటారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు అందులో యాక్టివ్ గా మారాడు. చిరంజీవికి దగ్గరగా మసులుకున్నాడు. చివరికి చిరంజీవి పేరును చాలా వరకు మిస్ యూజ్ చేశాడంటారు. ఈ వ్యవహారం తేడాగా ఉందన్న కారణంతో ఆయన్ను పిఆర్పీ నుంచి బయటకు పంపించేశారు. ఇక అక్కడి నుంచి ఊసరవెల్లి రంగులు మార్చినట్లుగా స్టోరీ మార్చేశాడంటారు. 2014 నుంచి 2019 మధ్య లోకేశ్ కు దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. అప్పట్లో లోకేశ్ ఐటీ శాఖ మంత్రిగా ఉండడంతో ఐటీ టవర్ల నిర్మాణం పేరుతో హడావుడి చేశారు లక్ష్మీనారాయణ. మొత్తం కెరీర్ లో పేరు ఒకరిది వాడుకోవడం, ఉపయోగించుకోవడం ఇదే కథ. అంటే లోకేష్ పేరు చెప్పడం, ఐటీ టవర్లలో స్పేస్ ఇస్తానని ఐటీ కంపెనీలకు బురిడీ కొట్టడం, తానే దగ్గరుండి టవర్లు కడుతున్నానని చెప్పుకోవడం ఇలాంటివెన్నో అప్పట్లో జరిగాయి. ఫుల్ పైసా వసూల్ కార్యక్రమమే. 30 అంతస్తుల పేరు చెప్పి ఒక్కటీ కట్టలేదు. అంతే కాదు రాజకీయ నేతలు ఎన్నికల్లో పోటీ చేసే టైంలో భారీగా చందాలు కూడా ఇచ్చిన దాఖలాలు ఉన్నాయంటారు. 2019 వైసీపీ గెలిచాక ఆ పార్టీకి దగ్గరయ్యే ప్రయత్నం చేశారు లక్ష్మీనారాయణ. అంతకు ముందు స్వరూపానందకు దగ్గరై.. ఆయన ద్వారా టీటీడీ బోర్డు మెంబర్ పోస్టు తెచ్చుకున్నారని చాలా మంది చెప్పుకుంటారు. సో చెప్పాలంటే మధ్యలో ఉన్న వారి పేరును వాడుకుని పనులు చేయించుకోవడంలో ఘనాపాఠిగా మారాడన్నది అభియోగం. వ్యాపారానికి ప్లస్ అవుతుందని చాలా మంది పేర్లు చెప్పుకుని వ్యవహారం నడిపించారంటారు. అంటే ఏ స్టేట్ మెంట్ ఇచ్చినా జనం ఈజీగా నమ్మాలి కదా. అందుకే.. సమాజంలో పేరున్న వాళ్ల పేర్లు చెబితే జనం ఈజీగా అట్రాక్ట్ అయ్యి.. ముందుకొస్తారు.. అడ్వాన్స్ లు భారీగా సమర్పించుకుంటారని స్కెచ్ వేశాడు. అనుకున్నట్లుగానే అది చాలా వరకు వర్కవుట్ అయింది కూడా. అంతెందుకు 2018లో మంగళగిరి విల్లా వెంచర్ లో పవన్ కల్యాణ్ ఓ ఇల్లు స్వయంగా కట్టుకుంటే.. అది తమ వెంచర్ లోనే ఉందని, మొత్తం వర్క్ తామే చూస్తున్నామంటూ ప్రచారం చేసుకున్నాడంటారు. సో అక్కడ పవన్ కల్యాణ్ పేరు వాడుకున్నారు. పవన్ కల్యాణే కొన్నారు. మనకూ గ్యారెంటీ ఉంటుందని చాలా మంది ముందుకొచ్చారు. అదే అదనుగా రేట్లు కూడా భారీగా పెంచేశాడన్నది అప్పటి ఆరోపణ. సినీ నటులతో బ్రోచర్లు.. కార్పొరేట్ తరహాలో ప్రకటనలు.. సినీ నటుల సమక్షంలోనే ప్లాట్ల కేటాయింపు.. ఇంద్రభవనాలను తలపించేలా గ్రాఫిక్స్ ఇలాంటివెన్నో చేస్తూ సాహితీ ఎండీ చేసిన కథలు అన్నీ ఇన్నీ కావు. ఏపీ, తెలంగాణ కాదేదీ అనర్హం అన్నట్లుగా పెద్ద ఎత్తున వెంచర్లు వేస్తున్నట్లు బిల్డప్ ఇవ్వడం, ముందుగానే డబ్బులు వసూల్ చేయడం, ఆ తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లడం. ఇదే స్టోరీ. గతేడాది గుంటూరు జిల్లా కాజా వద్ద వెంచర్ ప్రచారం కూడా ఇలాంటి స్కెచ్ లో భాగమే అని తేలింది. అప్పుడు బాధితులు పోలీసులను కూడా ఆశ్రయించారు. పలువురు సినీ నటులతో ప్రచారం చేయడం, సినీ నటులు ప్లాట్లు కొనకపోయినా కొన్నట్లుగా జనంలో ప్రచారం చేసుకోవడంతో? కృష్ణా, గుంటూరు జిల్లాలు, హైదరాబాద్‌తో సహా ఏపీలో వందలాది మంది కొనుగోలుదారులు ప్లాట్లు, విల్లాస్‌ను కొనుగోలు చేసేందుకు కోట్ల రూపాయలు అడ్వాన్స్‌గా చెల్లించారు. సీన్ కట్ చేస్తే విల్లా లేదు, ఫ్లాట్ లేదు. కనీసం స్థల రిజిస్ట్రేషన్లు కూడా చేయలేదు. డబ్బులు తిరిగి ఇచ్చేయాలని అడిగితే ఇచ్చిన చెక్కులు కూడా బౌన్స్ అయ్యాయి. వాయిదాల మీద వాయిదాలు వేసి చివరికి స్విఛాఫ్ చేసుకోవడం, ఒత్తిడి పెరిగినప్పుడల్లా అజ్ఞాతంలోకి వెళ్లడం ఇదే నడిచిందంటారు. ఒక్కో విల్లాను నలుగురైదుగురికి అమ్మడం, అది కూడా అగ్రిమెంట్ చేసి ఇవ్వడం, తీరా పొజిషన్ లోకి వచ్చే సరికి గొడవలు ముదరడం, అవి ఎవరికీ దక్కకుండా చేయడం ఇదే అసలు స్కెచ్. రైతుల నుంచి భూములు కొన్నా అగ్రిమెంట్లు చేసుకుని డబ్బులు కట్టకపోవడం, ఇటు కస్టమర్ల నుంచి ప్రీలాంచ్ పేరుతో వసూళ్లు చేసి బిల్డింగ్ లు కట్టకపోవడం అంటే రెండువైపులా భారీగా శఠగోపం పెట్టిన పరిస్థితి. బాధితులంతా నెత్తీ నోరు కొట్టుకోవడం తప్ప ఏమీ మిగలలేదు. ఇలాంటి కేసులన్నీ హైకోర్టుకూ చేరాయి. ఇదే కాదు? ఇక హైదరాబాద్ లో అంతా నా చేతుల్లోనే ఉంటారు.. చెప్పివన్నీ జరుగుతాయని ప్రచారం చేసుకుని అగ్రిమెంట్లు, ప్రీలాంచ్ ఆఫర్లతో గేమ్ నడిపిస్తున్నారన్న ఆరోపణలకు లెక్కలేదు. అటూ కేసులోనూ ముగ్గురు అధికారులు మారారని, కొత్తవారు వచ్చినప్పుడల్లా విచారణ మొదటికి వస్తుందంటున్నారు బాధితులు. పోలీసుల దగ్గరికి ఎన్నిసార్లు వెళ్లినా బలమైన ఆధారాలు లేవని చెప్పడం, కొంత వరకు భరోసా ఇవ్వడం వంటివి జరిగాయి. కానీ ఇప్పుడు మనీలాండరింగ్ ఇష్యూలో ఈడీ ఎంట్రీ అవడంతో సాహితీ ఇన్ ఫ్రా ఎండీ కథ ఎన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

## రైల్లో వస్తున్న గంజాయి పట్టివేత..

**రూ. 12 లక్షల విలువ చేసే 56 స్వాధీనం. ? ముగ్గురు అరెస్ట్..**

సికింద్రాబాద్: విశాఖపట్నం నుంచి హైదరాబాద్ కు వస్తున్నటువంటి గోదావరి ఎక్స్ ప్రెస్ లో ముగ్గురు వ్యక్తులు గంజాయిని తీసుకు వస్తున్నారని సమాచారం వచ్చింది. డైరెక్టర్ ఆఫ్ ఎన్ ఫోర్స్ మెంట్ విబి కమలాసన్ రెడ్డికి వచ్చిన సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్ టి ఎఫ్ బి టీం పోలీసులు బుధవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో గంజాయిని పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్ కి చెందిన సైదులు,. వెస్ట్ బెంగాల్ కు చెందిన సుమన్ సెన్, ఎండి సోహెల్ లు కలిసి గోదావరి ఎక్స్ప్రెస్ లో 20 కిలోల చొప్పున బ్యాగులో నింపుకొని హైదరాబాద్కు తీసుకొని వస్తున్న సందర్భంగా వచ్చిన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు వీరిని పట్టుకున్నారు. గంజాయి విలువ రూ. 12 లక్షల మేరకు ఉంటుందని అంచనా వేశారు. ఎస్టిఎఫ్ టీం లీడర్ ప్రదీప్ రావు, ఎస్సైలు బాలరాజు, సంధ్య ఇతర సిబ్బంది ఉన్నారు.

## 50 కేజీల నల్ల బెల్లం నాలుగు క్వింటాల పట్టికను



నూతనకల్: అక్రమంగా రవాణా చేస్తున్న 50 కేజీల నల్ల బెల్లం నాలుగు కుంటాల పట్టికను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ నాథ్ తెలిపారు. బుధవారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నమ్మదగిన సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా సూర్యాపేట నుండి తుంగతుర్తి వైపు వస్తున్న ఆటో ఆపి చెక్ చేయగా అందులో తుంగతుర్తి మండలం దొనబండ తండ చెందిన లాకావత్ హరిసింగ్, అతని మామ చిన్న గూడూరు గ్రామానికి చెందిన భూక్యా మాల్సూర్ ఇద్దరు అక్రమంగా నల్ల బెల్లం, పటిక రవాణా చేస్తుండగా పట్టుబడి చేసి అట్టి ఆటోతో పాటు 50 కేజీల నల్ల బెల్లం, నాలుగు క్వింటాల పటికను పట్టుకొని ఆటోను సీజ్ చేసి కేసు ఇద్దరి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# లీగల్ పాలిటిక్స్....

హైదరాబాద్: తెలంగాణ పాలిటిక్స్‌లో కొత్త ట్రెండ్.. ఎప్పుడూ చూడని ట్రెండే.. అదేంటంటే.. ఏకవచన సంబోధనలు, వ్యక్తిగత ఆరోపణలకుదాకా వెళ్లే తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కొత్త ఒరవడి కనిపిస్తోంది. మాటకు మాటతో సరిపోవడం లేదు. కౌంటర్‌కి రివర్స్ కౌంటర్ ఇస్తే చాలడం లేదు. ఎన్ని చెప్పుకున్నా ఎంత తిట్టుకున్నా సంతృప్తి చెందడం లేదు. అంతకుమించి అన్నట్లు.. లీగల్ నోటీసులతో ప్రత్యర్థులు, ఆరోపణలు చేసినవాళ్లను కోర్టుకీడ్చాలనుకుంటున్నారు నేతలు. కొన్నివారాల వ్యవధిలోనే ఇద్దరి లీగల్ నోటీసులతో స్టేట్ పాలిటిక్స్‌లో ఇప్పుడు దీనిపైనే చర్చ. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్‌కి లీగల్ నోటీసు ఇచ్చారు బీఆర్ఎస్‌కి చెందిన మాజీ మంత్రి హరీష్‌రావు. అవాస్తవ ఆరోపణలతో తన పరువుకు భంగం కలిగించారని న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు హరీష్‌రావు. ఎప్పట్నించో రాజకీయాల్లో ఉన్న హరీష్‌రావుకు ఆరోపణలు, సవాళు కొత్తకాకపోయినా.. ఈసారి కౌంటర్‌తో సరిపెట్టకుండా కాంగ్రెస్ ఎంపీకి లీగల్ నోటీస్ కూడా పంపారు. హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలతో పాటు మూసీ ప్రక్షాళన.. రాజకీయాలను షేక్ చేస్తోంది. ప్రభుత్వంపై విమర్శలతో విరుచుకుపడుతున్నాయి విపక్షపార్టీలు. బీఆర్ఎస్ నుంచి హరీష్‌రావు, కేటీఆర్‌తో పాటు ముఖ్యనేతలు బాధితులకు అండగా నిలుస్తున్నారు. ఇదే సమయంలో హరీష్‌రావుపై కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ సంచలన ఆరోపణలు చేశారు. హిమాయత్ సాగర్ ఈఓటీ పరిధిలో ఉన్న ఆనంద్ కన్వెన్షన్‌లో హరీష్‌కి వాటాలున్నాయని ఆరోపించారు ఎంపీ అనిల్ కుమార్. మూసీ పర్యటన పేరుతో రాజకీయ డ్రామాలు ఎందుకో తెలుసా.. హిమాయత్‌సాగర్ ఎఫ్టీఎల్ పరిధిలో కట్టిన కన్వెన్షన్‌లో హరీష్ రావుకు వాటాలున్నాయని సంచలన ట్వీట్ చేశారు అనిల్. కన్వెన్షన్‌ని కాపాడుకునేందుకే హరీష్ డ్రామాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు. ఆస్తులను కాపాడుకునేందుకు సామాన్య ప్రజలను అడ్డుపెట్టుకుంటున్న అగ్గిపెట్టె హరీష్.. ఖబర్దార్ అంటూ ఘాటుగా ట్వీట్ చేశారు అనిల్ కుమార్ యాదవ్. అనిల్ కుమార్ యాదవ్ ట్వీట్‌కి అదేస్థాయిలో కౌంటర్ ఇచ్చారు హరీష్‌రావు కూడా. ప్రజా సమస్యలపై పోరాడుతున్న తనపై బురదజల్లే వికృత రాజకీయాలకి కాంగ్రెస్ తెరలేపిందని హరీష్‌రావు రియాక్టయ్యారు. ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికి గోబెల్స్ ప్రచారాల్ని ఆశ్రయిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. రేపు గోల్కొండ కోట, చార్మినార్‌లో కూడా వాటాలు ఉన్నాయంటారేమో.. అబద్ధపు ప్రచారాలు చేస్తున్నందుకు లీగల్ నోటీస్ పంపుతున్నానని స్పందించారు. బహిరంగ క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావాకి రెడీగా ఉండాలని అనిల్ కుమార్ యాదవ్‌ని హెచ్చరించారు. దానిపై కూడా కాంగ్రెస్ ఎంపీ తనదైన శైలిలో మరో ట్వీట్ చేశారు. ఆరోపణలపై వివరణ మాత్రం ఇవ్వలేదంటూ.. నిప్పు లేనిదే పొగ రాదనుకోవాలా అంటూ మరో ట్వీట్ వదిలారు అనిల్‌కుమార్ యాదవ్. ఈ ఎపిసోడ్‌కి కొన్నాళ్లముందే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కి లీగల్ నోటీస్ పంపారు సృజన్‌రెడ్డి. ఆయన మరెవరో కాదు సీఎం రేవంత్‌రెడ్డికి బావమరిది వరస. అమృత్ పథకం టెండర్ల విషయంలో తనపై తప్పుడు ఆరోపణలు చేశారంటూ కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీకి లీగల్ నోటీసులిచ్చారు సృజన్‌రెడ్డి. తనపై చేసిన తప్పుడు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పట్టణాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూపొందించిన అమృత్ పథకంలో సీఎం కుటుంబసభ్యులు అవినీతికి పాల్పడ్డారని కేటీఆర్ చేసిన ఆరోపణలు దీనికి కారణమయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి తన అధికారాన్ని ఉపయోగించి బావమరిది సృజన్ రెడ్డికి పనులు అప్పగించారని తీవ్ర ఆరోపణలు చేశారు కేటీఆర్. సీఎం కుటుంబాన్ని కేటీఆర్ టార్గెట్ చేసుకోవడటంతో కాంగ్రెస్ కీలకనేతలంతా స్పందించారు. మంత్రి పొంగులేటి ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి కూడా తన అల్లుడు సృజన్‌రెడ్డికి నిబంధనల ప్రకారమే టెండర్ దక్కిందని వివరణ ఇచ్చారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో సీఎం సెంట్రిక్‌గా బీఆర్ఎస్ ఆరోపణలు చేయటంతో.. కేటీఆర్‌కి లీగల్ నోటీసులు ఇచ్చారు సృజన్‌రెడ్డి. ఈ లీగల్ నోటీసులకు అటు కేటీఆర్, ఇటు అనిల్‌కుమార్‌యాదవ్ ఇద్దరూ ఇప్పటికైతే ఎలాంటి సారీ చెప్పలేదు. చెప్పే మూడ్‌లో కూడా లేరు. కోర్టుదాకా వస్తే ఎవరి రియాక్షన్ ఎలా ఉంటుందన్నదే తెలంగాణ పాలిటిక్స్‌లో ఇప్పుడు హాట్‌టాపిక్..

## స్థానికేతరులకు ఇళ్లు కేటాయించవద్దు

సికింద్రాబాద్: మూసి నిర్వాసితులకు ఖార్కానలోని రెండు పడక గదుల ఇళ్లను అప్పగిస్తున్నారన్న సమాచారంతో మడ్ ఫోర్డ్ రెండు పడక గదుల ఇళ్ల సముదాయం వద్ద స్థానికులు ఆందోళన కు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్థానికంగా ఉన్న లబ్ధిదారులకు రెండు పడక గదులు కేటాయిం చకుండా మూసి నిర్వాసితులకు ఇవ్వడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసి నిర్వాసితుల కోసం రెవెన్యూ అధికారులు వచ్చి ఇల్లను సర్వే చేసి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికే మూడేళ్లు గడుస్తున్న స్థానికంగా ఉన్న తమకు ఇల్లులు కేటాయించలేదని బయట వ్యక్తులకు ఇల్లు కేటాయిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ధర్నాకు కూర్చున్న స్థానిక ప్రజలకు భాజపా నాయకుడు బీఎన్ శ్రీనివాస్ మద్దతు తెలిపి స్థానికులకే ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ మాదిరిగా అవకతవకలు జరగకుండా స్థానికులకే కేటాయించాలని కోరారు. టిఆర్ఎస్ నాయకురాలు నివేదిత సైతం ధర్నాలో పాల్గొని వారికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

## పిడియస్ బియ్యం పట్టివేత కేసు నమోదు..

నూతనకల్: అక్రమంగా రవాణా చేస్తున్న పిడిఎస్ బియ్యంను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై మహేంద్రనాథ్ బుధవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని బిక్కుమల్ల గ్రామ శివారు లో వాహనాలు తనిఖీ చేస్తుండగా మరిపెడ బంగ్లా నుండి నూతనకల్ వైపు వస్తున్న ఒక బొలెరో ట్రాలీ వాహనాన్ని చెక్ చేయగా అందులో ఇద్దరు వ్యక్తులు ఉండి 30 క్వింటాల పిడియస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నా, వారిని అదుపులోకి తీసుకొని విచారించాగా మరిపేడ బంగ్లా చెందిన బుద్ధ శ్రీనివాస్, బొలెరో డ్రైవర్ బాదావత్ సురేష్ సహాయ%శీ% తో తక్కువ ధరకు బియ్యం సేకరించి అధిక ధరలకు అమ్ముకునేందుకు వెళ్తుండగా పట్టుకొని బొలెరో వాహనాలు సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**